http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

ఆదివారం 22 జూన్ 2025

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad



## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




# విశాఖలో యోగా..
# ప్రపంచ రికార్డు

- విశాఖ వేదికగా గిన్నిస్ రికార్డు
- యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణః ప్రధాని నరేంద్రమోదీ
- యోగాంధ్ర ఒక చరిత్ర : సీఎం చంద్రబాబు
- యోగా దినోత్సవం భారతావనికి దక్కిన గౌరవంః డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

విశాఖపట్నం


విశాఖలో శనివారం నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ప్రపంచ రికార్డును సాధించినట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై యోగసనాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది. యోగా ప్రపంచ దేశాలను కలిపింది. యోగా దినోత్సవ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతిచ్చాయి. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. యోగా అనేది మానవతను పెంచే సామూహిక ప్రక్రియ. గత పదేళ్లలో కోట్ల మంది - మిగతా3లో



# సిరిసిల్ల అడ్డగా ఫోన్ ట్యాపింగ్..

- ప్రభాకర్ రావు కారణంగా ఫ్యామిలీలు నాశనం
- జడ్జీల ఫోన్లు కూడా ట్యాపింగ్ అయ్యాయి
- ప్రభాకర్ రావు ఇండియాకు వచ్చే ముందు కేటీఆర్ అమెరికా ఎందుకు వెళ్లారు
- 'అందరికంటే ఎక్కువ ఫోన్ ట్యాపింగ్‌పై ఆరోపణలు చేసింది నేనే
- హైదరాబాదు, సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగింది.
- కేంద్ర మంత్రి బండి సంజయ్

# ఆ సమాచారాన్ని
# 30 లోపు ఇస్తాం



- కాళేశ్వరం కమిషన్ లేఖకు సీఎంవో రిప్లై
- ఇప్పటికే ఇరిగేషన్ శాఖకు కాళేశ్వరం కమిషన్ లేఖ రాసిన సంగతి తెలిసిందే.
- 30వ తేదీలోపు ఆయా శాఖలు కమిషన్ అడిగిన సమాచారం ఇస్తాయి

హైదరాబాద్

సీఎంవోకు కాళేశ్వరం కమిషన్ లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కేబినెట్ అంశాలు కావాలని కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇరిగేషన్ శాఖకు కాళేశ్వరం కమిషన్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. కాళేశ్వరం కమిషన్ లేఖకు సీఎంవో రిప్లై ఇచ్చింది. 30వ తేదీ లోపు ఆయా శాఖలు కమిషన్ అడిగిన సమాచారం ఇస్తాయని సీఎంవో తెలిపింది. కమిషన్ అడిగిన సమాచారాన్ని ఆయా ఇరిగేషన్ అండ్ ఫైనాన్స్ శాఖకు సీఎంవో పంపించగా.. ఎల్లుండి కేబినెట్‌లో కాళేశ్వరం కమిషన్ లేఖపై సర్కార్ చర్చించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ ఘోష్ కమిషన్ చేపట్టిన క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ముగిసిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా.. అన్నారం, - మిగతా3లో



# పాక్ గొంతు ఎండాల్సిందే

- పాక్‌కు వెళ్లాల్సిన నీళ్లను రాజస్థాన్‌కు మళ్లిస్తాం
- "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం
- కానీ, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం.
- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా



# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

- భారత్‌లో ఏ ఉగ్రదాడి జరిగినా పాక్ మూల్యం చెల్లించుకోక తప్పదు
- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏ చర్య తీసుకోవడానికైనా మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాం'
- అన్ని సమస్యలపై భారత్‌తో చర్చకు సిద్ధమే
- కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా
# 8.58లక్షల దరఖాస్తులు

- భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే పనిలో ఉన్నాం
- దశలవారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్

భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే పనిలో ఉన్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన సందర్భంగా ఇవాళ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారని, దశలవారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో, రెండో - మిగతా3లో



# ఇజ్రాయెల్, ఇరాన్ సంఘర్షణపై కేంద్రం మౌనం తగదు

- కేంద్ర ప్రభుత్వ మౌనం దౌత్య వైఫల్యంలా కన్పిస్తోంది
- భారత దేశ నైతిక, వ్యూహాత్మక సంప్రదాయం నుంచి దూరంగా జరిగినట్లుగా కనిపిస్తోంది
- ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల వల్ల ప్రాంతీయంగా, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయి
- కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ

## 2028లో రప్పా రప్పా..
# 3.0 లోడింగ్

- ట్రెండింగ్‌లో హరీష్ రావు ఫొటో
- పటాన్ చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిన్నారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా
- ధర్నాలో ప్రత్యేక ఆకర్షణగా ప్లకార్డులు
- 'కేటీఆర్‌పై కేసు పెట్టడం.. కేసీఆర్‌ను కమిషన్ ముందుకు పిలవడం తప్ప రేవంత్ ఏం చేశాడు.





# ఇలా చేయడం ఓటర్ల గోప్యతకు భంగం కలిగించడమే

- రాహుల్ గాంధీ డిమాండ్‌ను తిరస్కరించిన ఈసీ
- సీసీటీవీ ఫుటేజీ ఫుటేజ్ ద్వారా ఓటు వేసినవారిని, వేయని వారిని గుర్తించవచ్చు
- ఈ వీడియోలు కేవలం అంతర్గత పర్యవేక్షణ కోసం మాత్రమే

# విమానం నుంచి 'మేడే కాల్'.. తప్పిన పెను ప్రమాదం

ఇండిగో విమానం నుంచి 'మేడే కాల్'తో ఒక్కసారిగా కలకలం రేగింది. గువహటి నుంచి చెన్నైకి వెళుతున్న విమానంలో ఈ ఘటన చోటు చేసుకోగా.. పెను ప్రమాదమే తప్పడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. అయితే, ఈ ఘటన మూడు రోజుల క్రితమే జరగ్గా.. తాజాగా వెలుగులోకి వచ్చింది. గువహటి నుంచి చెన్నైకి ప్రయాణికులతో గురువారం సాయంత్రం 4:40 గంటలకు బయలుదేరిన ఇండిగో విమానం.. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అందులో ఇంధనం చాలా తక్కువగా ఉందని పైలట్ గమనించారు. దీంతో? వెంటనే అప్రమత్తమైన పైలట్ ఏటీసీ(ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్)కి 'మేడే' సందేశం పంపారు. దీంతో బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. వైద్య, అగ్నిమాపక సేవలతో సహా అత్యవసర సేవల బృందాలను మోహరించారు. రాత్రి 8:20 గంటలకు విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. 168 మంది ప్రయాణికులు విమానంలో ఉండగా.. తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

**మేడే కాల్ అంటే..**

ఎవరైనా పైలట్ నుంచి ఏటీసీకి మేడే కాల్ వచ్చిందంటే ఆ విమానం కూలిపోయే ప్రమాదంలో ఉందని అర్థం. వెంటనే ఏటీసీ అధికారులు అత్యవసరం కాని సేవలన్నింటినీ నిలిపేసి



ఆ విమానాన్ని కాపాడేందుకు ప్రయత్నం మొదలు పెడతారు. సహాయం కోసం మేడే కాల్ ఇచ్చిన పైలట్ తన విమానం ఏ ప్రాంతంలో ఉంది? ఎంత ఎత్తులో ఉంది? ఎలాంటి ప్రమాదంలో ఉంది? విమానంలో ఎంతమంది ప్రయాణిస్తున్నారు అనే విషయాలు కూడా అందించాల్సి ఉంటుంది. దాన్ని బట్టి సహాయ చర్యలు ఎలా చేపట్టాలన్నది ఏటీసీ అధికారులు నిర్ణయిస్తారు. ఈ మేడే సిగ్నల్‌ను సాధారణంగా 121.5 మెగాహెడ్జ్, 243 మెగాహెడ్జ్‌లో పంపుతుంటారు. ఈ ఫ్రీక్వెన్సీలను ఏటీసీ అధికారులు అనుక్షణం పరిశీలిస్తుంటారు.

**ఎప్పటి నుంచి వాడుతున్నారో తెలుసా..?**

విమాన ప్రమాదాలు జరిగిన ప్రతిసారి ఒక పదం ప్రధానంగా వినిపిస్తుంది. అదే 'మేడే'. ఏదైనా పౌర విమానంలో అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు ఎయిర్‌పోర్టులోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) కేంద్రానికి సహాయం కోసం ఆ విమానం పైలట్ పంపే అభ్యర్థనే ఈ 'మేడే'. పైలట్ మేడే.. మేడే.. మేడే అని మూడుసార్లు పలికి సిగ్నల్ పంపాడంటే విమానం అత్యంత ప్రమాదంలో ఉందని అర్థం. ఈ పదానికి అర్థమేంటి?

సివిల్ ఏవియేషన్ రంగంలో మేడే అనే పదాన్ని మొదట 1920లో వాడారు. లండన్‌లోని క్రోయ్‌డన్ విమానాశ్రయంలో రేడియో ఆఫీసర్‌గా పనిచేసిన ఫ్రెడరిక్ స్టాన్లీ మాక్‌ఫోర్డ్ ఈ పదాన్ని మొదట ఉపయోగించినట్లు రికార్డుల్లో ఉంది. ఇది ఫ్రెంచ్ పదమైన మైడెర్‌కు సమానార్థకం. ఫ్రెంచ్‌లో మైడెర్ అంటే సహాయం చేయండి (హెల్ప్ మీ) అని అర్థం. 1923 నుంచి అంతర్జాతీయ రేడియో కమ్యూనికేషన్ వాడే పైలట్లు, సముద్రయానం చేసే మెరైన్ సిబ్బంది ఈ మేడే పదాన్ని వాడటం మొదలుపెట్టారు. అధికారికంగా మాత్రం సివిల్ ఏవియేషన్ రంగం 1927 నుంచి ఈ పదాన్ని స్వీకరించింది. అత్యవసర సమయాల్లో మేడేతోపాటు ఎస్ఓఎస్ పదాన్ని కూడా వాడుతుంటారు. కానీ, మేడే పదమే బాగా ప్రాచుర్యంలో ఉంది.

# పాక్ గొంతు ఎండాల్సిందే

**ఇంటర్నెట్ డెస్క్:** సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లూ దాయాది అన్యాయంగా నీళ్లు అందుకుందని, ఇకపై నీటి కొరతతో అల్లాడిపోవాల్సిందేనని దుయ్యబట్టారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా ఈ ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం. కానీ, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే విషయాన్ని పొందుపరిచారు. కానీ, ఒకసారి దీన్ని ఉల్లంఘిస్తే రక్షించడానికి ఇంకేమీ ఉండదు" అని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. "భారత్‌కు హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగిస్తాం. కెనాల్‌ను నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తాం. ఇన్నాళ్లూ పాక్ అన్యాయంగా నీటిని అందుకుంది. ఇకపై ఆ దేశం గొంతు ఎండాల్సిందే" అని అమిత్ షా దుయ్యబట్టారు.



1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో దీని అమలును భారత్ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్థాన్‌ను ఎండబెట్టే అవకాశాలున్నాయి. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడింది. అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80శాతం ఈ ఒప్పందం కింద లభించేదే. పాకిస్థాన్ జీడీపీలో 25శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే.. భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చు..!

**మహిళా రిజర్వేషన్లతోనే 2029 ఎన్నికలు..**

ఈసందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై అమిత్ షా స్పందించారు. "నియోజకవర్గాల పునర్విభజనపై ఫిర్యాదు చేసేందుకు ఎవరి వద్దా ఎలాంటి కారణాలు లేవు. అన్ని అంశాలను సమతుల్యంగా పరిగణనలోకి తీసుకునే దాన్ని చేపట్టబోతున్నాం. ఎవరూ అసంతృప్తికి గురికారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందునే డీఎంకే.. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తోంది" అని హెూంమంత్రి అన్నారు. ఇక, 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహిస్తామని తెలిపారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

# ఇజ్రాయెల్, ఇరాన్ సంఘర్షణపై కేంద్రం మౌనం తగదు

**దిల్లీ:** ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధంపై భారత్ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తప్పుబట్టారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ మౌనం దౌత్య వైఫల్యంలా కన్పిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి భారత దేశ నైతిక, వ్యూహాత్మక సంప్రదాయం నుంచి దూరంగా జరిగినట్లుగా కనిపిస్తోందని అన్నారు. టెహ్రాన్‌పై, టెల్ అవీవ్ చేస్తున్న దాడులు చట్టవిరుద్ధమైనవిగా.. సార్వభౌమాధికార ఉల్లంఘనగా అభివర్ణించారు. ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల వల్ల ప్రాంతీయంగా, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయని సోనియా పేర్కొన్నారు. ఈ ఘర్షణలు అస్థిరతను మరింత తీవ్రతరం చేయడం వల్ల మరిన్ని సంఘర్షణలకు బీజాలు వేస్తాయన్నారు. ఇరాన్, అమెరికాల మధ్య అణు చర్చలకు మార్గం సుగమం అవుతున్న సమయంలో టెల్ అవీవ్ ఒక్కసారిగా టెహ్రాన్‌లోని అణుస్థావరాలపై దాడులకు దిగడం సరైన చర్య కాదని సోనియా అభిప్రాయం వ్యక్తంచేశారు. మరోవైపు ఇజ్రాయెల్ చేస్తున్న మారణహెూమంలో గాజాలో 55,000 మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు



కోల్పోయారన్నారు. ప్రస్తుతం గాజా కరవు అంచున ఉండడంతో అక్కడ మిగిలిఉన్న ప్రజలు తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. గాజాలో జరిగిన విధ్వంసం మళ్లీ ఇరాన్‌లో పునరావృతం అవకుండా మరింత ఆలస్యం అవ్వకముందే భారత్ కల్పించుకోవాలని అన్నారు. ఆ నీళ్లను మళ్లిస్తాం.. పాక్ గొంతు ఎండాల్సిందే: అమిత్ షా

భారత్‌కు ఇరాన్-ఇజ్రాయెల్‌లతో దీర్ఘకాలిక దౌత్య సంబంధాలు ఉన్నాయని సోనియా అన్నారు. ఇటీవల కాలంలో న్యూదిల్లీ, టెల్‌అవీవ్ మధ్య రక్షణ, వాణిజ్యం, నిఘా సహకారాన్ని విస్తరించినప్పటికీ.. టెహ్రాన్‌తో లోతైన చారిత్రక, నాగరిక, వ్యూహాత్మక సంబంధాలను కూడా కొనసాగిస్తోందని ఆమె పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, యుద్ధ నివారణ విషయంలో ఇరుదేశాలు చర్చలు జరపడానికి భారత్ తనవంతు చర్యలు తీసుకోవాలని సోనియా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో శుక్రవారం ఇరాన్ దౌత్యవేత్త మొహమ్మద్ జావాద్ హెుస్సేనీ మాట్లాడుతూ..తమపై ఇజ్రాయెల్ చేపడుతున్న దురాక్రమణను బహిరంగంగా ఖండించాలని భారత్ సహా ప్రపంచ దేశాలను కోరారు. ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ.. తమ దేశంలోని కీలక ప్రాంతాలను ధ్వంసం చేస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో సోనియా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఇలా చేయడం ఓటర్ల గోప్యతకు భంగం కలిగించడమే

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లలోని ఫుటేజ్ విడుదల చేయాలన్న డిమాండ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఓటర్ల గోప్యతా హక్కును పరిగణనలోకి తీసుకోవడంతో పాటు చట్టపరమైన ఆటంకాల కారణంగా వాటిని బహిరంగపర్చలేమని తేల్చి చెప్పింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సీసీ ఫుటేజీలు బహిరంగపర్చాలని ప్రతిపక్షాల డిమాండ్లు చేస్తున్న సంగతి తెలిసిందే. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పదే పదే డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయితే ఇలా చేయడం ఓటర్ల గోప్యతకు భంగం కలిగించడమే అవుతుందని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి.


**ఈసీ వర్గాలు ఏం చెప్పాయంటే..**

ఓటర్ల గోప్యత: సీసీటీవీ ఫుటేజీ ఫుటేజ్ ద్వారా ఓటు వేసినవారిని, వేయని వారిని గుర్తించవచ్చు. తద్వారా వాళ్లపై వివక్ష లేదంటే బెదిరింపులకు పాల్పవచ్చు.

చట్టపరమైన పరిమితులు: ఈ ఫుటేజ్‌ను బయట పెట్టడం ద్వారా.. ప్రజాప్రతినిధుల చట్టం ఉల్లంఘన అవుతుంది. పైగా ఓటు వేయడం.. ఓటు వేయకపోవడం వ్యక్తిగత హక్కు అని సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చింది.

అంతర్గత వినియోగం మాత్రమే: ఈ వీడియోలు కేవలం అంతర్గత పర్యవేక్షణ కోసం మాత్రమే. ఒకవేళ కోర్టు ఆదేశిస్తే మాత్రమే వాటిని పంచుతాం.

ఫుటేజ్ తొలగింపు: ఎన్నికల ఫలితాలపై 45 రోజుల్లోగా కోర్టులో పిటిషన్ దాఖలు కాకపోతే, ఆ తర్వాత వీడియో ఫుటేజ్‌ను తొలగించడం సాధారణ ప్రక్రియనే అని ఈసీ తెలిపింది




కిందటి ఏడాది మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మయూతీ కూటమి ఘన విజయం సాధించింది. అయితే.. ఆ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని విపక్షాలు ఆరోపిస్తూ వస్తున్నాయి. అయితే ఆ ఆరోపణల్లో వాస్తవం లేదని ఈసీ పదే పదే చెబుతూ వస్తోంది.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈ మధ్యే 2024 లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర సహా అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కోసం కన్సాలిడేటెడ్, డిజిటల్ ఓటర్ రోల్స్‌ను ప్రచురించాలంటూ ఎన్నికల సంఘాన్ని కోరారు. అలాగే, మహారాష్ట్రలో ఎన్నికల రోజు సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ బూత్‌లలో రికార్డ్ అయిన అన్ని %జజుఎ% ఫుటేజ్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఈసీ తాజాగా చేసిన ప్రకటనపై రాహుల్ గాంధీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికల ఫిక్సింగ్ అని.. ప్రజాస్వామ్యానికి ఇదొక విషమని పేర్కొంటూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు.

## ఆపరేషన్ సింధు.. భారత్‌కు 290 మంది భారతీయులు.. స్వాగతం పలికిన విదేశాంగ శాఖ..!



ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌లో ఉన్న భారతీయులను సురక్షితంగా దేశానికి తిరిగి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఆపరేషన్ సింధు చేపట్టి భారతీయులను ఇరాన్ నుంచి తరలిస్తున్నది. ఇప్పటి వరకు 517 మంది భారత పౌరులను సురక్షితంగా తరలించినట్లు విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. ఇందులో విద్యార్థులతో పాటు ఇతర పౌరులు ఉన్నారని పేర్కొంది. శుక్రవారం రాత్రి 11.30 గంటలకు ఇరాన్ నుంచి 290 మంది భారతీయులతో కూడిన విమానం ఢిల్లీకి చేరిందని విదేశాంగశాఖ ప్రతినిధి రణదీర్ జైస్వాల్ సోషల్ మీడియా వేదికగా తెలిపింది. ఇందులో పెద్ద సంఖ్యలో విద్యార్థులతో పాటు ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లిన వారు, మహిళలు ఉన్నారు. వారికి విదేశాంగ మంత్రిత్వశాఖ కార్యదర్శి (సీపీవీ-వోఐఏ) అరుణ్ ఛటర్జీ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇరాన్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆపరేషన్ సింధుకు సహకారం అందించారని.. ఈ కార్యక్రమంలో ఇకపై కొనసాగుతుందని పేర్కొన్నారు. శనివారం ఉదయం తుర్కెమేనిస్తాన్ రాజధాని అష్గాబాత్ నుంచి మరొక విమానం ఢిల్లీకి చేరుకుంది. ఈ విమానంతో ఆపరేషన్ సింధు కింద భారతదేశానికి తిరిగి వచ్చిన మొత్తం పౌరుల సంఖ్య 517 కి చేరుకుంది. అవసరాన్ని బట్టి ఈ ఆపరేషన్ కొనసాగుతుందని.. ఇరాన్‌లో చిక్కుకుపోయిన ప్రతి పౌరుడికి సహాయం అందించనున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. గురువారం మొదటి దశలో 110 మంది పౌరులతో కూడిన విమానం భారత్‌కు చేరిన విషయం తెలిసిందే. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు తీవ్రంగానే ఉన్నాయని.. ఈ క్రమంలో భారత ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకుందని.. పౌరుల భద్రతకు పెద్దపీట వేసి భారతీయులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు 'ఆపరేషన్ సింధు' మిషన్ చేపట్టినట్లు విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. ఇరాన్ నుంచి పౌరులను తరలించడం సవాల్‌తో కూడుకున్న పని అని.. దీన్ని భారత ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించిందని చెప్పింది.

## మహిళలకు పెన్షన్ పెంపు.. జూలై నుంచే అమలు




బీహార్‌లో మహిళలకు సామాజిక పెన్షన్‌ను పెంచారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి సర్కారు పెన్షన్‌ల పెంపు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రూ.400 గా ఉన్న పెన్షన్‌ను ఇప్పుడు రూ.1100 లకు పెంచారు. పెరిగిన పెన్షన్ జూలై నెల నుంచే అమలులోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయాన్ని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. సామాజిక భద్రతా పెన్షన్ పథకం కింద వృద్ధ మహిళలు, వికలాంగ మహిళలు, వితంతు మహిళలకు నెలనెలా ఇచ్చే పెన్షన్‌ను రూ.400 నుంచి రూ.1100 కు పెంచుతున్నామని తెలియజేస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని నితీశ్‌కుమార్ పేర్కొన్నారు. అర్హులందరూ జూలై నుంచే పెరిగిన పెన్షన్ అందుకుంటారని సీఎం తెలిపారు. అర్హులందరి బ్యాంకు ఖాతాల్లో జూలై 10న పెన్షన్ డబ్బులు పడుతాయని తాను హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు. ఈ పెన్షన్‌ల పెంపుతో రాష్ట్రంలోని 1,09,69,255 మంది లబ్ధిదారులకు మేలు జరుగనుందని సీఎం నితీశ్ కుమార్ వెల్లడించారు.

## 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు.

**ఇంటర్నెట్‌డెస్క్:** భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా భవిష్యత్తులో దేశంలో ఏ ఉగ్రదాడి జరిగినా పాకిస్థాన్ అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జమ్మూకశ్మీర్‌లోని ఉదంపూర్‌లో ఆయన యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. పాక్ ఇలాగే ఉగ్రవాదానికి మద్దతిస్తూ ఉంటే.. అందుకు ఆ దేశం అత్యంత దారుణమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏ చర్య తీసుకోవడానికైనా మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. 2016లోని సర్జికల్ స్ట్రైక్, 2019లోని వైమానిక దాడులకు కొనసాగింపే ఆపరేషన్ సిందూర్ అని ఆయన పేర్కొన్నారు. తమ 'థౌజండ్ కట్' పాలసీ పనిచేయదని ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు అర్థమైందన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా పాక్‌లోని ఉగ్రస్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడి చేసి వాటిని ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. భారత్ దాడులకు వణికిపోయిన పాక్ చివరకు కాళ్లబేరానికి వచ్చింది. ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయాలనే లక్ష్యం నెరవేరడంతో కాల్పుల విరమణకు భారత్ సైతం అంగీకరించింది.

## రూ.500 లంచం తీసుకున్నందుకు పదేళ్ల తర్వాత జైలు



**దొడ్డబళ్లాపురం(కర్ణాటక):** రూ.500 లంచం తీసుకున్న పాపానికి రిటైర్డ్ అయిన 10 సంవత్సరాలకు ఒక విలేజ్ అకౌంటెంట్‌కు 10 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఈ సంఘటన బెళగావిలో చోటుచేసుకుంది. నాగేశ్ శివంగేకర్ 30 సంవత్సరాల క్రితం విధుల్లో ఉన్న సమయంలో బెళగావి తాలూకా కడోలి గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఓ పని కోసం నాగేశ్‌ను ఆశ్రయించగా రూ.500 లంచం డిమాండ్ చేశాడు. దీంతో లక్ష్మణ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. పథకం ప్రకారం లోకాయుక్త పోలీసులు దాడి చేసి నాగేశ్‌ను అరెస్టు చేశారు. 2006లో నాగేశ్‌కు కోర్టు రూ.వెయ్యి జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించింది. తర్వాత ధార్వాడ హైకోర్టును ఆశ్రయించగా శిక్షను రద్దు చేసింది. అయితే అప్పటికే నాగేశ్ రిటైర్ య్యారు. అయితే లోకాయుక్త సుప్రీకోర్టుకు అప్పీలుకు వెళ్లింది. నాగేశ్‌కు పది సంవత్సరాల జైలు శిక్షను కోర్టు ఖరారు చేసింది. ఆయన్ను బెళగావి హిండలగా జైలుకు తరలించారు. కాగా ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతి చెంది 5ఏళ్లు కావడం గమనార్హం.

# 2028లో రప్పా రప్పా.. 3.0 లోడింగ్..




**సంగారెడ్డి:** పుష్ప-2 సినిమాలోని రప్పా.. రప్పా.. డైలాగ్ తెలుగు రాష్ట్రాల్లో మరోసారి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తలపెట్టిన రైతు మహా ధర్నాలో రప్పా.. రప్పా.. ప్లకార్డులు, పోస్టర్లు దర్శనమిచ్చాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు.. ఫుల్ జోష్‌లో కనిపించారు. పటాన్ చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిన్నారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా జరుగుతోంది. ఈ ధర్నాలో మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. హరీష్ రావు రైతు మహా ధర్నాలో రప్పా.. రప్పా.. ప్లకార్డులను కార్యకర్తలు చూపించారు. 2028లో రప్పా.. రప్పా.. 3.0 లోడింగ్ అంటూ ధర్నాలో ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో, ధర్నాలో ప్రత్యేక ఆకర్షణగా ప్లకార్డులు నిలిచాయి. మరోవైపు.. హరీష్ రావు మాట్లాడుతూ.. 'కేటీఆర్‌పై కేసు పెట్టడం.. కేసీఆర్‌ను కమిషన్ ముందుకు పిలవడం తప్ప రేవంత్ ఏం చేశాడు. రాష్ట్రంలో ఏ సర్వే చేసిన మళ్ళీ అధికారంలోకి బీఆర్ఎస్ వస్తుంది అని అంటున్నాయి. రెండు లక్షల మంది రైతుల కోసం బీఆర్ఎస్ పోరాడుతుంది.. మీ అందరికి రైతు భరోసా వచ్చే వరకు పోరాటం ఆపేది లేదు. ఇది ఆరంభం మాత్రమే. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని తలవకుండా రేవంత్ స్పీచ్ ఉండదు' అంటూ ఘాటు విమర్శలు చేశారు. రెండు లక్షల మంది రైతులు ఔటర్ రింగ్ రోడ్డు మీద ధర్నా చేస్తే రేవంత్ మైండ్ బ్లాక్ అవుతుంది. రైతుబంధు ఇవ్వకపోతే రంగారెడ్డి, మల్కాజిగిరి, సంగారెడ్డి రైతులందరూ కదులుతారు జాగ్రత్త. వెంటనే రెండు లక్షల మంది రైతులకు రైతుబంధు ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంది. దేవాదుల ఏ బేసిన్ లో ఉందని రేవంత్ అడగడం హాస్యాస్పదం. నల్లమల్లల పుట్టిన అని చెప్పుకొనే రేవంత్.. నల్లమల్ల ఎక్కడ ఉంది? అని అడుగుతున్నాడు. కౌశిక్‌ను అరెస్ట్ చేయడం దారుణం.. రేవంత్‌ని ప్రశ్నిస్తే అర్ధరాత్రి ఓ అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేశారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# విశాఖలో యోగా.. ప్రపంచ రికార్డు



-మొదటిపేజీ తరువాయి

జీవితాల్లో యోగా వెలుగులు నింపింది. ప్రకృతి సౌందర్యానికి, ప్రగతికి చిరునామా విశాఖపట్నం. నెలన్నర రోజుల్లో యోగాంధ్రను విజయవంతం చేయడంలో మంత్రి లోకేశ్ పాత్ర కీలకమైందని.. కొత్త కార్యక్రమాల రూపకల్పనలో ఆయన చొరవ ప్రశంసనీయమని ఈ సందర్భంగా మోదీ కొనియాడారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైంది. యోగాంధ్ర ద్వారా చరిత్ర సృష్టించాం. యోగాంధ్రలో పాల్గొనేందుకు దాదాపు 3.3 లక్షల మంది వచ్చారు. తొలిసారి రెండు గిన్నిస్ రికార్డులు సృష్టించాం. రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కోసం 2.45 కోట్ల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 25 లక్షల మందికి సర్టిఫికెట్లు ఇవ్వాలని అనుకుంటే.. ఇప్పుడు 1.80 కోట్ల మందికి సరిఫికెట్లు ఇవ్వాల్సి వస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రపంచ యోగా దినోత్సవం భారతావనికి దక్కిన గౌరవం. యోగా విశిష్టతను రుగ్వేదం చెబితే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశ్వవ్యాప్తం చేశారు. రుగ్వేదం యోగా విశిష్టతను, గొప్పదనాన్ని చెబితే దానిని ప్రధాని నరేంద్ర మోదీ విశ్వవ్యాప్తం చేశారన్నారు యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసు కోవాలని, విశ్వ నరుడు నరేంద్ర మోదీ పిలుపు మేరకు యోగా దినోత్సవాన్ని "యోగా ఒకే భూమి ఒకే ఆరోగ్యం అనే థీమ్ ను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మం తాలూకు విశిష్టతను యోగా ద్వారా ఖండాంతరాలకు చేర్చిన ఘనత నరేంద్ర మోదీదే. యోగా సాధకులు ఎంతటి దఢ చిత్తాన్ని కలిగి ఉంటారో ఒత్తిడి జయించి సంకల్ప సాధకులుగా ఎలా నిలబడ తారో అన్నదానికి మోదీ నిలువెత్తు ఉదాహరణ యోగా డే విషయమై మోదీ ప్రతిపాదన కు 177 దేశాలు ఆమోదం తెలిపాయి.

## విశాఖ వేదికగా గిన్నిస్ రికార్డు

విశాఖ వేదికగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించింది. ఈ విశిష్ట కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీతోపాటు గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఈ కార్య క్రమానికి లక్షలాది మంది ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు,పాఠశాల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, క్రీడాకారులు, యోగా సంఘాలు, నౌకాదళం, కోస్ట్ గార్డు సభ్యులు,పారిశ్రామిక వేత్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. వీరంతా విశాఖ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు దాదాపు మూడు లక్షల మంది ప్రజలు సామూహిక యోగా ప్రదర్శనలు చేశారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో దాదాపు 2 లక్షల మంది ఆసనాలు వేశారు. సముద్రంలో యుద్ధ నౌకలపై నేవీ సిబ్బంది, వారి కుటుంబాలు వేసిన యోగసనాలు అందరినీ ఆకర్షించాయి. అంతకు ముందు ప్రధాని మోదీ యోగా

# భాగ్యనగరంలో బొగ్గు విక్రయ కేంద్రం



**అదిలాబాద్ :** తెలంగాణలో చిన్న పరిశ్రమలే టార్గెట్ గా సింగరేణి యాజమాన్యం వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సింగరేణిలో ఏటా 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. తెలంణలోని థర్మల్ విద్యుత్ కేంద్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు సింగరేణి నుంచి ఏటా బొగ్గు సరఫరా జరుగుతోంది.హైదరాబాద్ మహానగరంగా విస్తరించి, అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్నతరుణంలో, నగరం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిశ్రమల నిర్వహణకు అవసరమైన బొగ్గు కోసం ఇన్నాళ్లు రామగుండం లేదా కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోంది. తక్కువ మొత్తంలో బొగ్గు అవసరమైనప్పటికీ , దూరప్రాంతం నుంచి సరఫరా చేసుకోవడంతో రవాణా ఖర్చులు వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. ఈ ప్రభావం బొగ్గు విక్రయాలపై పడటంతో ఆశించిన స్థాయిలో సింగరేణిలో బొగ్గు విక్రయాలు జరగడంలేదు. దీనిపై దృష్టి సారించిన సింగరేణి యాజమాన్యం హైదరాబాద్ బహిరంగ మార్కెట్ పై కన్నేసింది. బొగ్గు ఎగుమతులు భారీగా పెంచేందుకు భాగ్యనగరాన్ని టార్గెట్ చేసింది. అతి త్వరలో హైదరాబాద్‌లో సింగరేణి బొగ్గు విక్రయ కేంద్రం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. తెలంగాణ రాజధానిలో విక్రయ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా బొగ్గు అవసరాలకు ఇకపై హైదరాబాద్ చుట్టుప్రక్కల పరిశ్రమల నిర్వాహకులు రామగుండం, కొత్తగూడెం వెళ్లాల్సిన పనిలేదు. రవాణాఖర్చుల భారం భారీగా తగ్గుతాయి. హైదరాబాద్ విక్రయ కేంద్రంలోనే బొగ్గు అందుబాటులోకి రావడంతొ? విక్రయాలు ఊహించని స్థాయిలో పెరుగుతాయి. ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా బొగ్గు తరలించేదుకు టన్నుకు 1600 రూపాయలు ఖర్చవుతుంది. రైలు మార్గం ద్వారా తరలించేందుకు టన్నును 500 రూపాయలు అవుతుంది.భారీ మొత్తంలో బొగ్గును హైదరాబాద్ విక్రయ కేంద్రానికి తరలించి, అక్కడ నుంచి నేరుగా అమ్మకాలు జరపడం ద్వారా డిమాండ్ పెరగడంతోపాటు సరఫరా సులభతరం అవుతుంది. హైదరాబాద్ చుట్టు ప్రక్కల పరిశ్రమలతోపాటు సమీపంలోని జిల్లాల నుంచి హైదరాబాద్‌కు రవాణా సదుపాయం ఎనీటైమ్ అందుబాటులో ఉంటుంది కాబట్టి విక్రయాలు ఊహించని ఊపందుకుంటాయి. ఇలా సింగరేణి చరిత్రలో గతంలో ఎన్నడూ లేనట్లుగా బహిరంగా మార్కెట్‌లో సింగరేణి బొగ్గు విక్రయాలు ప్రారంభించడం ద్వారా సింగరేణి సంస్దకు లాభాల పంట ఖాయమని యాజమాన్యం భావిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా విస్తరించిన వ్యాపారం ద్వారా వచ్చే లాభాల వల్ల సింగరేణి కార్మికులకు మేలు జరుగుతుందని, ఆర్ధికంగా కార్మికులు బలోపేతం అయ్యేందుకు ఇది మంచి అవకాశం కావడంతో కార్మికుల నుంచి సైతం హర్షం వ్యక్తమవుతోంది. హైదరాబాద్ కేంద్రంగా బహిరంగ మార్కెట్‌లో బొగ్గు విక్రయం నిర్ణయం సరైనదే అయినప్పటికీ నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలిని భావించింది సింగరేణి యాజమాన్యం. ఈ నేపథ్యంలో నాణ్యత తక్కువగా ఉండే జీ 14, జీ 15 బొగ్గు సరఫరా నిలిపివేయాలనే నిర్ణయం తీసుకున్నారు. క్వాలిటీ బొగ్గు జీ 13ను మాత్రమే బహిరంగ మార్కెట్ లోకి సరఫరా చేయాలని భావించారు. ఇలా టార్గెట్ హైదరాబాద్ ద్వారా ఊహించని స్థాయిలో బొగ్గు విక్రయాలు పెరుగుతాయని సింగరేణి సంస్ద పూర్తి నమ్మకంతో ఉంది. సాధ్యమైనంత వేగంగా తెలంగాణ రాజధానిలో విక్రయ కేంద్రం ఏర్పాటు, బొగ్గు అమ్మకాలను ప్రారంభించడం ద్వారా బహిరంగ మార్కెట్ సింగరేణి సత్తా చాటేందుకు

## భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా 8.58లక్షల దరఖాస్తులు

-మొదటిపేజీ తరువాయి

విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో ఈనెల 3 నుంచి 20 వరకు మూడో విడతలో సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. ఈ మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 8.58 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి తెలిపారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67వేలు, భద్రాద్రి కొత్తగూడెంలో 61వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48వేలు, నల్గొండలో 42 వేల దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులు ఇచ్చామని, ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని వివరించారు. స్వీకరించిన వాటికి రశీదులు అందజేయడం జరిగిందని, వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## ఆ సమాచారాన్ని 30 లోపు ఇస్తాం..

-మొదటిపేజీ తరువాయి

సుందిళ్ల బరాజ్‌లలో సైతం లోపాలు బయటపడ్డాయి. ఈ మూడు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్‌తో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. దీంతో నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, పలువురు ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లు, మాజీ మంత్రులకు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. కమిషన్ గడువు వచ్చే నెలాఖరుతో ముగియనుండగా, ఆ లోగానే ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం ఉంది.

## రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ.. ప్రతిపక్ష నేతలను తప్పుడు కేసులతో వేధిస్తున్న ప్రభుత్వం



**హైదరాబాద్:** రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అక్రమ అరెస్టు చాలా దారుణమని మండి పడ్డారు. ప్రతిపక్ష నేతలను తప్పుడు కేసులతో వేధిస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. విదేశాల నుంచి వస్తున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని తప్పుపట్టారు. మనోజ్ రెడ్డి అనే వ్యాపారిని బెదిరించిన కేసులో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని వరంగల్ సుబేదారి పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్ట్ చేశారు. అనంతరం వరంగల్‌కి తరలించారు. ఎమ్మెల్యే తరచూ బెరదింపులకు దిగుతున్నాడని, రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరిస్తున్నారని మనోజ్‌రెడ్డి భార్య కట్టా ఉమాదేవి హనుమకొండ సుబేదారి పోలీసులకు ఏప్రిల్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై 308(2), 308(4), 352 బీఎన్ఎస్ సెక్షన్ల కింద సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిరిసిల్ల అడ్డగా ఫోన్ ట్యాపింగ్..

**కరీంనగర్:** హైదరాబాదు, సిరిసిల్ల కేంద్రంగా తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. ప్రభాకర్ రావు చాలామంది సంసారాలు నాశనం చేశారు.. జడ్జీల ఫోన్లు కూడా ట్యాపింగ్ అయ్యాయి అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభాకర్ రావు ఇండియాకు వచ్చే ముందు కేటీఆర్ అమెరికా ఎందుకు వెళ్లారు అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో భాగంగా సిట్ నోటీసులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. తాజాగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'అందరికంటే ఎక్కువ ఫోన్ ట్యాపింగ్‌పై ఆరోపణలు చేసింది నేనే. హైదరాబాదు, సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగింది. ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావు అనేక మంది ఉసురు పోసుకున్నారు. జడ్జీల ఫోన్లు కూడా ట్యాపింగ్ అయ్యాయి. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పజెప్పాలి. పెద్దాయన చెబితే ఫోన్ ట్యాపింగ్ చేశామని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్‌కి ఇంకా ఎందుకు నోటీసులు ఇవ్వలేదు?. ఫోన్ ట్యాపింగ్‌కు కారణం కేసీఆర్, కేటీఆరే. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ అయ్యింది. ప్రభాకర్ రావు సీఎంవో ఆఫీసుని అడ్డాగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్ చేశారు. ఆయనకు రాచమర్యాదలు చేయడం బంద్ చేయండి. అందరి జీవితాలు నాశనం చేసిందే ప్రభాకర్ రావు. నన్ను పేపర్ లీక్ అయ్యిందని ప్రభాకర్ రావు అదేశాల మేరకే అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభాకర్ రావు అండ్ కో వారిని కాపాడే ప్రయత్నాలు చేస్తోంది. తెలంగాణను సర్వనాశనం చేసిందే కేసీఆర్ ఫ్యామిలీ. ప్రభాకర్ రావు ఇండియాకు వచ్చే ముందు కేటీఆర్ అమెరికా ఎందుకు పోయారు?. కేటీఆర్ అమెరికా పోయి ప్రభాకర్ రావుతో మాట్లాడిన తర్వాతనే ఆయన ఇండియాకు వచ్చాడు. నాకు సిట్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది.. విచారణకు హాజరవుతాను' అని స్పష్టం చేశారు.

## కొండా కాంట్రవర్సీ..

**వరంగల్ :** వరంగల్ కు చెందిన కొండా మురళి ఫ్యామిలీ ఎక్కడ ఉన్నప్పటికీ కాంట్రవర్సీకి కేరాఫ్ గా ఉంది. కొండా సురేఖ మంత్రి పదవిలో ఉంటూ కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల అనేక సందర్భాల్లో కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వివాదంగా మారాయి. టాలీవుడ్ హీరోల కుటుంబం పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నాడు పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టాయి. అదే సమయంలో తర్వాత మంత్రులుగా ఉన్న వాళ్లు లంచాలు తీసుకోనిదే ఏ పనిచేయరని చేసిన వ్యాఖ్యలు కూడా సొంత పార్టీలో నేతలకు కన్నెర్రకు కారణమయ్యాయి. ఇక తాజాగా కొండా మురళి చేసిన వ్యాఖ్యలతో మరోసారి కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపింది. సొంత పార్టీ నేతలనే కొండా మురళి లక్ష్యంగా చేసుకుని మాట్లాడారు. పార్టీ మారిన నేతలపై... కొండా మురళి వరంగల్ లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సిగ్గుంటే పార్టీ మారినప్పుడు పదవులుకు రాజీనామాలు చేయాలని చేసిన వ్యాఖ్యలు సూటిగా తగిలిన నేతలు రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘకాలంగా మంత్రిగా పనిచేశానని చెప్పుకునే నేతలు వారు గతంలో పనిచేసిన పార్టీలను భ్రష్టు పట్టించారన్నారు. నాడు తెలుగుదేశం లో చంద్రబాబు నాయుడిని, తర్వాత బీఆర్ఎస్ లో కేసీఆర్ ఓటమికి కారణమయ్యారని కొండా మురళి కడియం శ్రీహరిని ఉద్దేశించి అన్నారని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి దీనిని కూడా ఆగం చేస్తున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు కడియం శ్రీహరితో పాటు రేవూరి ప్రకాశ్ రెడ్డి, బస్వరాజు సారయ్య వంటి వారు కొండా మురళి వ్యాఖ్యలకు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వీరంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యం సన్నిహితులే.. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి కూడా కొండా మురళి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ల ముసిలోడు పరకాలకు వచ్చాడని, దరిద్రమైన నాయకుడని, నా రెండు కాళ్ల

## రాయలసీమకు నామకరణం చేసిన

# తాత్వికుడు చిలుకూరి

దాదాపు 130 సంవత్సరాలు దత్తమండలాలు , సీడెడ్ జిల్లాలు అంటూ అవమాన కరంగా పిలుచుకునే ప్రాంతానికి రాయలసీమ అని గౌరవ ప్రదంగా పిలుచుకునే నామకరణం చేసింది చిలుకూరి నారాయణ రావు. 1946లో ఒక రేడియో ప్రసంగంలో చిలుకూరి నారాయణరావు తాను రాయలసీమ అన్న పేరును సూచించినందుకు గర్వపడు తున్నానని చెప్పుకోవటాన్ని ఎవరూ ఖండించలేదు. కాబట్టి ఈ పేరును చిలుకూరి నారాయణ రావే పునరుద్ధరించి ఉంటాడని భావిస్తున్నారు. 1800 సంవత్సరంలో నిజాం నవాబు ఎలుబడిలో ఉన్న నేటి సీమ ప్రాంతం సైనిక ఒప్పందంలో భాగంగా ఆంగ్లేయులకు నిజాము వదిలి వేయించు కున్నారు. అందుకే నాటి నుంచి సీడెడ్ జిల్లాలు అని పిలిచే వారు. సీడెడ్ అంటే అర్థం వదిలివేయించు కోవడం ఈ పేరు అవమానకరంగా ఉన్నదన్న పేరుతో ఆంగ్లేయులు దత్త మండలాలు అని కూడా పిలిచారు. ఇలా 1928 వరకు సాగింది. ఉత్తరాంధ్రకు చెందిన చిలుకూరి నారాయణరావు తెలుగు అధ్యాపకుడిగా అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో చేరారు. ఈ ప్రాంతంలోని గొప్పతనాన్ని పరిశీలించి, ఇంత గొప్ప చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతానికి అవమాన కరంగా సీడెడ్ , దత్తమండలాలు అని పిలవడం సరికాదని భావించారు. 1928 నవంబరులో ఆంధ్ర మహాసభలు నంద్యాలలో జరిగాయి. ఆ సభలలో సీమ నేతల కోరిక మేరకు 17,18 తేదీన దత్తమండలాల ప్రథమ మహాసభ కడప కోటి రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో చిలుకూరి నారాయణ రావు, ఘన చరిత్ర కలిగిన ఆ ప్రాంతానికి దత్త మండలం , సీడెడ్ జిల్లాలు అని పిలవడం సరికాదని శ్రీకృష్ణ దేవరాయలు ఏలిన ప్రాంతం కనుక రాయలసీమ అని పేరు పెట్టాలని ప్రతిపాదించారు. ఆ సభలో పాల్గొన్న పప్పూరి రామాచార్యులు , నీలం సంజీవరెడ్డిలు బల పరచడంతో సభ ఆమోదించింది. నాటి నుంచి రాయలసీమగా మారింది. డా.చిలుకూరి నారాయణరావు (ఆగష్టు 9, 1889 – జూన్ 22, 1951) భాషావేత్త, చరిత్ర కారులు, సంస్కృతాంధ్ర పండితులు. మద్రాసు విశ్వ విద్యాలయంలో తొలిసారిగా తెలుగు సాహిత్యంలో పి.హెచ్.డి. చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఖురాన్ గ్రంథాన్ని అనువదించిన తొలివ్యక్తి చిలుకూరి నారాయణ రావు కావడం గమనార్హం. ఆయన



విశాఖపట్నం జిల్లా, పొందూరు సమీపంలోని ఆనంద పురంలో 1889, ఆగష్టు 9 న జన్మించారు. తండ్రి భీమాచారి. తల్లి లక్ష్మమ్మ. మాతృభాష కన్నడం. ఆయన శ్రీకాకుళం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసి, పర్లాకిమిడి, విజయనగరం లోని మహారాజా కళాశాలలో చదివి పట్టభద్రులయ్యారు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి తెలుగు, కన్నడం భాషలలో ఎం.ఏ. పట్టా పొందారు. పదకొండవ శతాబ్దం నాటి ఆంధ్ర భాష గురించి పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఉత్తర సర్కారు జిల్లాలలో ఇంగ్లీషు బోధన విధానం ప్రచారం చేయటానికి కొంతకాలం పాఠశాల పరీక్షకులుగా పనిచేశారు. తరువాత అనంతపురం దత్త మండల కళాశాల (తరువాతి కాలంలో గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ)లో ఆంధ్రోపన్యాసకులుగా చాలాకాలం పని చేశారు. ఆయన ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చే 'కళాప్రపూర్ణ' బిరుదును, కాశీ సంస్కృత విద్యాపీఠంచే 'మహెూపాధ్యాయ' బిరుదును పొందారు. 'ఆంధ్ర బెర్నార్డ్ షా' అనే బిరుదుకూడ ఆయనకు దక్కింది. చిలుకూరి నారాయణరావు గిడుగు రామ్మూర్తితో పాటు వ్యావహారిక భాషా ఉద్యమ ప్రచారానికి విశేష కృషి చేశారు. 1933 లో జరిగిన అభినవాంధ్ర కవిపండిత మహాసభ, నారాయణరావు అధ్యక్షతన ఆధునిక వ్యవహారిక భాషనే బోధన భాషగా ఉపయోగిం చాలని తీర్మానించింది. ఆలంకారికులు, వైయాకరణుల మధ్యలో తెలుగు కవులు నలిగి పోయారని భావించారు. అందుకే 1937లో వెలువ రించిన ఆంధ్ర భాషా చరిత్రను అప్పట్లోనే వాడుక భాషలో రాశారు. మద్రాసు విశ్వ విద్యాలయంలో 1930 ఫిబ్రవరి ఆరోతేదీన తొలి సారిగా తెలుగు సాహిత్యంలో పిహెచ్.డి. చేసిన పండితుడు ఆయనే. ఆయన 240 గ్రంథాలు వ్రాశారు. ఒకలక్షా యాభైవేల తెలుగు సామెతలు సేకరించారని చెపుతారు. నవ్య సాహిత్య పరిషత్తు తొలి అధ్యక్షునిగా పని చేశారు. శ్రీకృష్ణ దేవరాయ విద్యా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షులుగా, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలు ద్రావిడ భాషలని కాల్డ్ వెల్ పండితుని సిద్ధాంతంతో చిలుకూరి విభేదించారు. తమిళ, మలయాళ భాషలకు సన్నిహిత సంబంధం ఉంది, తెలుగు భాషకు తక్కిన ద్రావిడ భాషలతో సంబంధం లేదు, స్వతంత్రమైన స్థానం ఉందన్న గ్రియర్‌సన్ వాదనతో చిలుకూరి ఏకీభవించారు. తెలుగు లోకి ఖురాన్ గ్రంథాన్ని అనువ దించిన తొలివ్యక్తి చిలుకూరి నారాయణ రావు. మొదటి "తెలుగు కురాను" (1925), రెండవ ముద్రణ 1938 పీఠికలో ఆయన ఇలా అన్నాడు "ఎన్నియో సమయములందు హిందువులకు, ముస్లిములకు కలిగిన కలహముల వలన ఆపద రానున్నపుడు ఈ యాంధ్రానువాదము ఈ రెండు మతముల వారికిని సామరస్యమును కుదిరించినది. ఇదియే గ్రంథకర్తకును, గ్రంథ ప్రకాశకులకును బహుమానము". అని పేర్కొన్నారు. ఉమర్ ఖయ్యూమ్ వ్రాసిన రుబాయత్‌లను ముత్యాల సరములు అనే పేరుతో తెలుగులో వ్రాశారు. ఆయన1951, జూన్ 22 న పుట్ట కురుపు వ్యాధి వలన చెన్నైలో పరమ పదించారు.

# విప్లవానికి నాంది పలికిన తొలి త్యాగగాధలు

1897 జూన్ 22... భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఒక ఘట్టం కాదు, గుండెకు గుబులుతో తాకే జ్ఞాపకం. మహారాష్ట్రలోని పూణే నగరంలో బ్రిటిష్ అధికారులైన డబ్ల్యూ.సి.రాండ్, ఆయెర్స్ట్ హత్యలకు గురైన ఈ రోజు, భారత యువత బ్రిటిష్ పాలనపై సాయుధ నిరసనగా తొలి మంటలను రగిలించిన రోజు. మహారాష్ట్రలోని పూణే నగరంలో బ్రిటిష్ అధికారులు డబ్ల్యూ.సి. రాండ్, ఆయెర్స్ట్ హత్యకు గురైన ఈ సంఘటన, బ్రిటిష్ పాలనపై భారతీయుల అసహనానికి, అణచివేతకు వ్యతిరేకంగా రాజుకున్న అగ్నిపర్వతానికి ప్రతీక. ఈ హత్యల వెనుక ఉన్నవారు ఛాపేకర్ సోదరులు– దామోదర్ హరి, వాసుదేవ హరి, బాలకృష్ణ హరి %–% మరియు మహాదేవ్ వినాయక్ రనడే. వీరిని భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన తొలి విప్లవ కారులుగా చరిత్ర గుర్తిస్తుంది. 1857 తిరుగుబాటు తర్వాత భారతదేశంలో తీవ్రవాద జాతీయవాదం యొక్క మొదటి కేసు ఇది. 19వ శతాబ్దాంతంలో మహారాష్ట్రను ప్లేగు మహమ్మారి పట్టి కుదిపేసింది. ప్రజల మధ్య అపోహలు, అవిశ్వాసం వ్యాపించిన సమయంలో, ప్రజలకు ప్రగాఢంగా తోడుగా నిలవాల్సిన బ్రిటిష్ పాలకులు, దయా ధర్మాలు మరిచి దురాశ, దురాగ్రహాలకు లోనయ్యారు. ప్లేగు నివారణ పేరుతో పూణే నగరంలో స్పెషల్ ప్లేగ్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కమిషనర్ డబ్ల్యూ.సి. రాండ్ ఆదేశాలపై బ్రిటిష్ సైనికులు స్థానికుల ఇళ్లలో బలవంతంగా చొరబడడం, మహిళల గౌరవాన్ని త్రోసిపుచ్చేలా ప్రవర్తించడం, ఆస్తులను ధ్వంసం చేయడం వంటి దుష్కృత్యాలకు పాల్పడ్డారు. ఈ పరిస్థితులు ప్రజలలో తీవ్ర అసహనాన్ని కలిగించగా, యువతలో ప్రత్యక్షంగా ప్రతీకారం తీర్చుకోవాలనే భావన చెలరేగింది.దామోదర్ హరి చాపేకర్ చిన్ననాటి నుంచే దేశభక్తితో పెరిగారు. దేశీయ సాంస్కృతిక సంస్థలైన వంగమయ సేవా సమితి వంటి ఉద్యమాల ద్వారా యువతను ఉత్తేజితం చేశారు. వాసుదేవ్, బాలకృష్ణ చాపేకర్ సోదరులు కూడా ఆయుధాల వినియోగంలో ప్రావీణ్యం సంపాదించారు. బ్రిటిష్ అధికారుల దురాచారాన్ని సహించలేని స్థితికి చేరుకున్న వీరు, రాండ్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. మహాదేవ్ వినాయక్ రనడే అనే యువకుడు కూడా ఈ కుట్రలో వారితో సహకరించాడు. 1897 జూన్ 22న రాణి విక్టోరియా వజ్రోత్సవాల సందర్భంగా డబ్ల్యూ.సి. రాండ్ బగ్గీపై నగరానికి బయలుదేరిన సమయంలో ఛాపేకర్ సోదరులు ఆయన్ను వెంబడించి కాల్పులు జరిపారు. రాండ్ అక్కడికక్కడే మరణించగా, ఆయెర్స్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇది భారత స్వాతంత్ర్య



పోరాటంలో 'పథకబద్ధమైన తొలిసారిగా జరిపిన హత్య'గా చరిత్రలో నిలిచింది. ఈ సంఘటన తర్వాత పూణేలో కలకలం రేగింది. బ్రిటిష్ ప్రభుత్వం విచారణ చేపట్టి దామోదర్ హరిని అరెస్టు చేసింది. అతి కొద్ది కాలంలోనే వాసుదేవ్, బాలకృష్ణ, రనడే కూడా పట్టుబడ్డారు. చాపేకర్ సోదరుల విచారణ రహస్యంగా కాకుండా బహిరంగంగా జరిగింది. వారు తమ నేరాన్ని దాగకుండా ధైర్యంగా అంగీకరించి, దేశ సేవే తమ ధ్యేయమని?గా ప్రకటించారు. వారి తీర్పు ప్రకారం దామోదర్ హరిని 1898 ఏప్రిల్ 18న, వాసుదేవ్ హరిని 1899 మే 8న, బాలకృష్ణ హరిని 1899 మే 12న ఉరితీశారు. మహాదేవ్ రనడేను కూడా అదే విధంగా ఉరితీశారు. ఈ కుట్రకు సహకరించినట్లు ఆరోపణలపై ఖండో విష్ణు సాథే అనే విద్యార్థికి పదేళ్ల కఠిన శిక్ష విధించారు. చాపేకర్ సోదరులు చేపట్టిన చర్యను హింసాత్మకంగా పేర్కొనటం సామాన్యంగా జరిగే ముద్రవేయడమే కాని, అది బ్రిటిష్ అధికారుల దుర్మార్గ పాలనకు ఎదురుదెబ్బగా, తలెత్తిన సమర శంఖారావంగా భావించాలి. వీరి త్యాగం తదుపరి తరం యువతలో దేశభక్తిని, తిరుగుబాటును రగిలించింది. వీరి ప్రేరణతోనే సావర్కర్, భగత్ సింగ్, నేతాజీ , రాజగురు వంటి అనేక మంది స్వాతంత్ర్య యోధులు తమ తమ మార్గాల్లో పోరాటం చేపట్టారు. చాపేకర్ సోదరుల సంఘటన ఆధారంగా 1979లో రూపొందిన 'జూన' అనే మరాఠీ చిత్రం వారి త్యాగగాధను ప్రజల ముందుకు తీసుకొచ్చింది. ఈ చిత్రంలో చారిత్రక ప్రామాణికతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారి దేశభక్తిని నేటి తరానికి తెలియజేసే ప్రయత్నం జరిగింది. అలాగే 2017లో అదే పేరుతో మరో సినిమా రూపొందినది.చాపేకర్ సోదరుల విప్లవ చర్యలు దేశ స్వాతంత్ర్య చరిత్రకు తొలి సాయుధ పోరాటానికి నాంది పలికాయి. వారి ఆత్మత్యాగం భారతీయుల మది లోకి స్వేచ్ఛ పట్ల ఆకాంక్షను నాటింది. బ్రిటిష్ పాలనను ప్రతిపక్షించేందుకు జనహృదయాన్ని సిద్ధం చేసింది. మితిమీరిన రాజపాలనపై ప్రజాస్వామ్యాత్మక గళాన్ని కాదు, అవసరమైతే ఆయుధాన్ని కూడా ఎత్తాల్సిన పరిస్థితి అప్పటికి స్పష్టమైంది. వీరి త్యాగం చరిత్ర పుస్తకాల్లో చిన్న పేరుగా కనిపించవచ్చేమో గాని... భారతదేశ భవిష్యత్తును మలచిన తొలి ధైర్యవంతుల చారిత్రక చిరునామాగా శాశ్వతంగా నిలిచిపోతుంది. వారి అమరత తరం తరాలకు దేశభక్తికి మార్గసూచిగా నిలుస్తూనే ఉంటుంది.

# జీవవైవిధ్య నెలవులు వర్షారణ్యాలు

హరిత వృక్షాలకు నెలవులు, జీవకోటి తావులు, పర్యావరణహిత సేవలు చేస్తున్న వర్షారణ్యాలు లేదా రెయిన్ ఫారెస్టులు ప్రపంచ మానవాళి మనుగడకు అమూల్య సేవలు అందిస్తున్నాయి. నేలలో తేమ పునాదులుగా నిత్యం పచ్చని పందిరిలను పరుస్తున్న వర్షారణ్యాలు వివిధ వృక్ష జంతు చిరునామాలుగా నిలుస్తున్నాయి. కార్చిచ్చులకు తావులేని వర్షారణ్యాలు తరతరాలుగా మానవ జీవితాలకు నీడగా నిలుస్తూ, భూమాతను కాలుష్యం నుంచి కాపాడుతూ ఎనలేని సేవలను చేస్తున్నాయి. వర్షారణ్యాల ప్రాధాన్యాన్ని గుర్తించిన అంచర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 22 జూన్ రోజున "ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవం (వరల్డ్ రెయిన్‌ఫారెస్ట్ డే)"ను పాటించడం ఆనవాయితీగా మారింది. వర్షారణ్యాలను కాపాడుకోవడం, రక్షణ గొడుగులు పట్టడం మన కనీస కర్తవ్యం కావాలి. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకర వాతావరణం, జీవ వైవిధ్యం అందించడానికి నేడే కార్యాచరణకు పూనుకోవాలి. అడవుల నరికివేతను నిషేధించడం, అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడం, సుస్థిర ప్రణాళికలు అమలు చేయడం విధిగా జరగాలి. వర్షారణ్యాల్లో అపార పక్షులజాతులు, వైవిధ్య జంతు జాతులు, విలువైన వృక్ష సంపద దాగి ఉంటాయి. మానవాళికి సురక్షిత తాగునీరు అందించే నెలవులుగా వర్షారణ్యాలు పని చేస్తున్నాయి. గాలిలో కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గించడం, భూమాత రక్షణకు చేయూతనివ్వడం, ప్రతికూల వాతావరణ మార్పులను కట్టడి చేయడం, విలువైన ఔషధాలను అందించడం, కలపను అందించడం, మాంసానికి తావులు, పర్యాటకానికి ఊతమివ్వడం, పోషకాహారాన్ని అందించడం, నేల సారాన్ని పెంచడం, సాంస్కృతిక ప్రదేశాలుగా నిలవడం, ఆహార భద్రతకు చేయూతనివ్వడం, జీవ వైవిధ్య పరిరక్షణ, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, మిలియన్ల కుటుంబాలకు జీవనోపాధులను కల్పించడం లాంటి పలు ప్రయోజనాలను వర్షారణ్యాలు కల్పిస్తున్నాయి.

## ఆలయ ఆవరణలో ఇల్లు కోల్పోయిన బాధితులకు అండగా ఉంటా

**సింగల్ విండో ఛైర్మన్ జూపల్లి భాస్కర్ రావు**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** చారకొండ మండలం సిరసనగండ్ల శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఆవరణలో ఇల్లు వ్యాపార దుకాణాలను కోల్పోయిన నిర్వాసితులకు వెల్దండ ఉమ్మడి మండల సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు వ్యక్తిగతంగా ఒక్క ఒక్క కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు పదివేల రూపాయల నగదును అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటయ్య గౌడ్ మాజీ జెడ్పిటిసి రవితేజ మాజీ సర్పంచ్ సాయికుమార్, శారద, బి ఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖనిలో 9 తెలంగాణ బెటాలియన్ కరీంనగర్ ఎన్ సి సి ఆధ్వర్యంలో గోదావరిఖని సెక్టార్ లోని పాఠశాలలు, కళాశాలల.ఎన్ సి సి విద్యార్థులు యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. 2025 సంవత్సర యోగ దినోత్సవ భావం ఉద్దేశాన్ని ఘనంగా చాటుతూ యోగా ట్రైనర్ తగరపు శ్రీ వర్షిత ఆధ్వర్యంలో ఎన్ సి సి విద్యార్థులు యోగాసనాలు సాధన చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా,ఎన్ సి సిఅధికారులు లెఫ్టినెంట్ బి తిరుపతి, ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, సెకండ్ ఆఫీసర్ సరిత, థర్డ్ ఆఫీసర్స్ ప్రవీణ్, శ్యామ్, తిరుపతి, శ్రీనివాస్, సతీష్, ఉష మరియు తొమ్మిదో బెటాలియన్ కరీంనగర్ తరపున సుబేదార్ ధృవ్ కుమార్ హవల్దార్ స్వప్నిల్ పాటిల్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రైవేట్ డిగ్రీ కళాశాల గోదావరిఖని, బసంత నగర్ ప్రైవేటు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు మరియు 200 మందిఎన్ సి సి క్యాడెట్లు హాజరు అయ్యారు.

## కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు యాంటీ డ్రగ్ పై అవగాహన

**మత్తు పదార్థాల అలవాటుతో భవిష్యత్తు నాశనం: పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని** తెలంగాణ రాష్ట్రాన్ని మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు యాంటీ నార్కోటిక్ బ్యూరో వింగ్ వారి ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ యాంటీ డ్రగ్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఎన్ టి పి సి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ మరియు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం కు ముఖ్యఅతిథిగా హాజరైన రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా విద్యార్థులతో మాట్లాడి మత్తు పదార్థాల వినియోగం వలన కలుగు నష్టాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా నషా ముక్త్ భారత్, యాంటీ డ్రగ్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొంతమంది వ్యక్తులు యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అమ్ముతూ బానిసలుగా మారుస్తు యువత భవిష్యత్తు నాశనం చేస్తున్నారన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ సూచించారు. చిన్న వయసులోనే అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులు మత్తు పదార్థాలు, గంజాయి వంటి వాటికి దూరంగా ఉంటారన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మిన, సరఫరా చేసిన, సేవించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సందర్భంగా విద్యార్థులు అధికారుల తో కలిసి మాదక ద్రవ్యాలు, గంజాయి వాడకంపై పోస్టర్లను ఆవిష్కరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పిల్లలకు యోగా సాధన వలన ఉపయోగాలు, యోగ సాధన ద్వారా ఆరోగ్యం కాపాడుకోవడంతో పాటు మానసికంగా శారీరకంగా దృడంగా ఉంటామని తెలిపారు. సీపీతో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా యోగాసనాలు సాధన చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏ సి పి ఎం రమేష్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శోభన్ బాబు, రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎన్టీపిసి ఎస్ఐ ఉదయ్ కిరణ్, సిసి హరీష్, పోలీస్ సిబ్బంది, స్కూల్ టీచర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై యువత, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు

**సిద్దిపేట** : మాదకద్రవ్యాల నిర్మూలనపై వారం రోజులపాటు ప్రణాళిక ప్రకారంగా యువతకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వీక్ 2025 కార్యచరణ పై జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యం అనేది సమాజానికి ఒక చీడపురుగు లాంటిదని అన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలకు యువత ఆకర్షితులవుతారు కాబట్టి ఉన్నత పాఠశాల విద్యా స్థాయి నుండి ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్, మెడికల్ తదితర విద్యాసంస్థలపై ప్రధానంగా ఫోకస్ పెడుతూ ఈనెల 26వ తేదీ వరకు మాదకద్రవ్యాలు వాడడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ అవేర్నెస్ కార్యక్రమాలలో భాగంగా ఒకరోజు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని, పాఠశాల, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులకు వేరువేరుగా వ్యాసరచన, ఉపన్యాసం, పెయింటింగ్స్ తదితర కాంపిటీషన్స్ నిర్వహించాలని, అన్ని విద్యా సంస్థలలో సమీప ప్రాంతాల పోలీస్, ఎక్సైజ్ మరియు విద్యాశాఖ అధికారులచే ఆయా విద్య సంస్థలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, ప్రతి విద్య సంస్థలో వాల్ పోస్టర్లు అంటించాలని, యువతను ఆకర్షించేలా మాదకద్రవ్యాల నియంత్రణపై యువకుల చేతనే స్లొగన్స్ రాయించాలని, చివరి రోజు 26 వ తేదీ విద్యార్థులతో జిల్లా కేంద్రంలో మాదక ద్రవ్యాల నియంత్రణ ర్యాలీని నిర్వహించి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి వక్తలచే పెద్ద ఎత్తున యువతకు అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ కాంత్ రెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నియంత్రణ అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, డిపిఆర్ఓ రవికుమార్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ, అడిషనల్ డిఆర్డిఓ, విద్యా, అటవీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూన్ 21** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం,మాదకద్రవ్యాల నిర్మూలనతో సమాజ శ్రేయస్సు మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశంతో పోలీస్ శాఖ అవగాహన.. మంచిర్యాల జిల్లా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ఉదయం మందమర్రి సింగరేణి గ్రౌండ్‌లో యోగా సాధన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని చాటుతూ...అదే వేదికగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "మాదకద్రవ్యాల నిరోధ వారోత్సవాల" అవగాహన కార్యక్రమాన్ని చేపట్టడం విశేషం.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జీ.ఎం) దేవేందర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) శశిధర్ రెడ్డి మాట్లాడుతూ... యోగా మనస్సుకు ప్రశాంతతను,శరీరానికి దృఢత్వాన్ని ఇస్తుందన్నారు. అయితే,నేటి యువత మాదకద్రవ్యాల బారిన పడి తమ విలువైన భవిష్యత్తును, కుటుంబాల ఆనందాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల మహమ్మారిని సమాజం నుండి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అమ్మకం, సరఫరాకు సంబంధించిన అనుమానిత సమాచారాన్ని తక్షణమే పోలీసులకు అందించడం ద్వారా.. ప్రజలు తమవంతు సహాయాన్ని అందించాలని ఆయన కోరారు."యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ వీక్" లో భాగంగా, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణ లక్ష్యంతో పోలీస్ శాఖ ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన తెలిపారు.ముఖ్య అతిథి దేవేందర్ మాట్లాడుతూ,శారీరక ఆరోగ్యానికి యోగా ఎంత అవసరమో, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా సామాజిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.యోగా దినోత్సవం వంటి పవిత్రమైన వేదికపై మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించడం అభినందనీయమని మందమర్రి పోలీసులను కొనియాడారు.కార్యక్రమం ప్రారంభంలో యోగా గురువుల పర్యవేక్షణలో యోగా సాధకులు పోలీస్ సిబ్బంది,సింగరేణి కార్మికులు,ప్రజలు ఉత్సాహంగా సామూహిక యోగాసనాలు వేశారు.ఈ కార్యక్రమంలో కాసిపేట ఎస్సై,మందమర్రి ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది,సిబ్బంది, సింగరేణి అధికారులు, యోగా సాధకులు, మరియు మందమర్రి పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ప్రశాంతతను పెంపొందించడానికి యోగా ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని కడ్తాల్ మండల కేంద్రంలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి దశరత్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరికి దినచర్యలో యోగా ముఖ్యమైన అధ్యాయమని పేర్కొన్నారు.యోగా అంటే కేవలం వ్యాయామమే కాదని క్రమశిక్షణ,ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు.జీవితంలోని అన్ని అంశాల మధ్య సమతుల్యతను సాధించడమే కాకుండా, ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు యోగా సమగ్ర విధానాన్ని అందిస్తుందని అన్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు యోగాను అవలంబించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ,మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, మాజీ రైతు కోఆర్డినేటర్ మంగల్పల్లి నరసింహ, మాజీ వార్డు సభ్యులు కేశని మహేష్, గురిగళ్ళ రామచంద్రయ్య,మూడ అశోక్, పాండు నాయక్, క్యామ వెంకటేష్, సిద్దిగారి వెంకటేష్,మూడ రవి,అమృతం పాండు, సిద్దిగారి దాసు, మొగిళ్ళ చెన్నయ్య, అంజి , శ్రీను ,సురేష్ ,శ్రీకాంత్, కృష్ణ, రమేష్ ,కుమార్, కరుణాకర్, రాఘవ ,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యోగడే సంబరాలు



**అగ్నిధారన్యూస్, మందమర్రి మండలం జూన్ 21** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని, మందమర్రి సింగరేణి సేవా సమితి సహకారంతో,యోగా గురువులు మల్కల్ల శంకరన్న ఆధ్వర్యంలో.. మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో యోగ సంబరాలు నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా..మందమర్రి జనరల్ మేనేజర్ దేవేందర్ స్థానిక సీ.ఐ శశిధర్ రెడ్డి పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్ మందమర్రి,కాసిపేట ఎస్సైలు రాజశేఖర్ ప్రవీణ్ కుమార్ సివిల్ ఎస్ ఈ రాములు గుర్తింపు సంఘం నాయకులు సలేంద్ర సత్యనారాయణ కాంగ్రెస్ నాయకులు సొతుకు సుదర్శన్ బిజెపి నాయకులు డివి దీక్షితులు అందుగుల శ్రీనివాస్,సప్పిడి నరేష్,టిఆర్ఎస్ నాయకులు బత్తుల శ్రీనివాస్ ఓ రాజశేఖర్ ఎం.డి అబ్బాస్,వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్ పాల్గొని,ముందుగా పతాంజలి చిత్రపటానికి పూలమాల వేసి,జ్యోతి ప్రజ్వలన చేయడం జరిగింది.అనంతరం యోగా గురువు శంకర్ సూచనలతో..యోగ ఆసనాలు,యోగ విన్యాసాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జనరల్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ...యోగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడానికి ఎంతో ఉపయోగపడుతుందని,అందరూ..ప్రతిరోజు కనీసం రెండు గంటల సమయాన్ని కేటాయించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకొని పరిపూర్ణ ఆయుష్షుతో జీవించాలని సూచించారు.మరియు స్థానిక సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ... 2014లో ఐక్యరాజ్యసమితిలో యోగాను ప్రపంచ యోగా దినోత్సవం గా ప్రకటించడానికి ప్రధాని నరేంద్ర మోడీ సూచించిన మేరకు జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవం గా గత 11 సంవత్సరాలుగా జరుపుకోవడం జరుగుతుందని, ఆరోగ్యానికి పూర్తి రక్షణ యోగ తోనే సాధ్యమైతుందని సూచిస్తూ,ముఖ్యంగా యువత పెడదారి పడకుండా,ఎటువంటి చెడు అలవాట్లకు లోను కాకుండా మరియు డ్రగ్స్ పైన అవగాహన కొరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నుంచి వారం రోజులు అవగాహన కార్యక్రమాన్ని కూడా చేపట్టడం జరిగిందని తెలియజేశారు.అనంతరం ఈ కార్యక్రమానికి,విచ్చేసిన ముఖ్య అతిథులు అందరిని యోగ సభ్యులు సన్మానించుకోవడం జరిగింది. అతిడులందరూ యోగా గురువు శంకర్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు యోగ అభిమానులు, శ్రేయోభిలాషులు, పత్రికా,మీడియా సోదరులు,వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి యోగ సభ్యులు అందరూ..తరఫున ధన్యవాదాలు తెలియజేయడం జరుగుతుంది.

## మృతుడి కుటుంబానికి మాజీ సర్పంచ్ భరోసా

కుటుంబానికి 5,000/- ఆర్థిక సహాయం అందించిన ఎల్ ఎన్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకు ర్తి)** కడ్తాల మండల కేంద్రానికి చెందిన నార్లకంటి మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతూ కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ ఉస్మాని యా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరా మర్శించారు. మృతుడి కుటుంబా నికి 5,000/- ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుం బాన్ని అన్ని విధాలుగా ఆదుకుం టామని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ, రాజకీయాలకు తావివ్వ కుండా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ ఉంటామని,సమాజ శ్రేయస్సే తమ ధ్యేయమని, మండల పరిధిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా మేమున్నామని బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటా మని తెలిపారు.మాజీ సర్పంచ్ వెంట ఇప్పల్ల కృష్ణయ్య, లక్ష్మీ నారాయణ రామచంద్రయ్య శేఖర్,నాగార్జున,సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## వేల్జాల్ గ్రామంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండ పల్లి మండలం వేల్జాల్ గ్రామంలో తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు తెలంగాణ సిద్ధాంతకర్త, స్ఫూర్తి ప్రదాత తెలంగాణ జాతిపిత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పుల మాల వేసి ఘన నివాళులు అర్పించిన వేల్జాల్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ అజీజ్ మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో డైరెక్టర్ తిరుమణి కృష్ణయ్య గౌడ్, నాయ కులు కృష్ణా రెడ్డి, జి.జనార్దన్ రెడ్డి, బి. ఇస్తారి, ఈశ్వర్ బి.రవి కుమార్, విష్ణు, అబిలష్ గౌడ్,నారాయణ,అంజయ్యరామకృష్ణ, లచ్చయ్య గౌడ్, మల్లేష్, తది తరులు పాల్గొన్నారు.

## పోలీస్ వ్యవస్థలో పనిచేసే నాకే న్యాయం జరగలేదు

**అగ్నిధారన్యూస్ మంథని :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని శ్రీపాద కాలనీలో నివాసముంటున్న హెూంగార్డు దేవేందర్ కుమారుడు రాజ్ కుమార్ ను మంథని పోలీసులు కొట్టిన దెబ్బలకు తీవ్రంగా గాయపడి,ఆ మనస్థాపంతో ఆత్మహత్య చేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తమ కొడుకుని రక్షించి మా కడుపుకోత తీర్చాలని రాజ్ కుమార్ ను అంబులెన్స్ లో ఉంచి బాధితుడి తల్లిదండ్రులు మంథని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం రోజున ధర్నాకు దిగారు.బాధితుడి తండ్రి దేవేందర్ మాట్లాడుతూ. .పోలీస్ వ్యవస్థలో పనిచేసే నా కుమారునికి సరైన న్యాయం జరగలేదని,సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని పోలీస్ డిపార్ట్మెంట్ పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.గత ఖరీఫ్ పంట కొనుగోలు సమయంలో వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద గొడవలకు పాల్పడుతున్నారంటూ కొంతమంది ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో అకారణంగా తన కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేసి తీవ్రంగా కొట్టి గాయపరచడంతో తమ కుమారుడు విగత జీవుడై శరీరంలో ఎటువంటి చలనం లేక మంచానికే పరిమితమై విగతజీవుడై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడని అతను ఆరోపించాడు.ఈ సంఘటనపై మంథని పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేసును సాగదీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు.తమ కుమారుడు ఈ స్థితికి రావడానికి కారణం మంథని పోలీసులేనని నా కుమారుని చావుకు కారణం కూడా వారేనని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. మంథని పోలీసులు సామాన్య ప్రజానీకానికి పోలీస్ స్టేషన్లో సరైన న్యాయం చేయట్లేదని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మంథని సీఐ రాజు గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో బాధితులు ధర్నా విరమించారు.

## లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా.. యోగ కార్యక్రమం



**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూన్ 21** 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా,ఇల్లందు క్లబ్ లో లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో..యోగ కార్యక్రమాలను లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీమతి స్వరూప రాణి దేవేందర్ అధ్యక్షతన నిర్వహించినారు. అనంతరం వారు మాట్లాడుతూ... మొదటగా అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షల ను లేడీస్ క్లబ్ మెంబర్స్ కి, సివిక్స్ మహిళా ఉద్యోగులకు తెలియజేశారు. అందరు కూడా ప్రతి రోజూ ఒక గంట సమయాన్ని కేటాయించి యోగ చేసినట్లయితే మీ ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ మెంబర్స్ మరియు యోగ మాస్టర్లు పాల్గొన్నారు.

## సింగరేణి మందమర్రి ఏరియాలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు..

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూన్ 21** 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా..సింగరేణి మందమర్రి ఏరియా లో అంతర్జాతీయ యోగ దినోత్సవం ని అన్ని గనులలో,డిపార్ట్మెంట్లలో,జనరల్ మేనేజర్ కార్యాలయంలో యోగ కార్యక్రమాలను నిర్వహించినారు. అలాగే మందమర్రి లోని,జనరల్ మేనేజర్ కార్యాలయంలో.. అంతర్జాతీయ యోగా కార్యక్రమాలను ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ...మొదటగా అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు ఉద్యోగులకు, అధికారులకు, నాయకులకు ప్రజలకు తెలియజేశారు. అందరు కూడా..ప్రతి రోజూ ఒక గంట సమయాన్ని కేటాయించి యోగ చేసినట్లయితే,మీ ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది అన్నారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యంగా ఉంటేనే ఇమ్యూనిటీ పెరగడంతోపాటు, ఇన్ఫెక్షన్స్ కూడా రాకుండా ఆరోగ్యంగా ఉంటామన్నారు.కనుక ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సింగరేణి సంస్థ మూడు పువ్వులు,ఆరు కాయలుగా.. ఉత్పత్తి ఉత్పాదకత,రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించు కుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం విజయ ప్రసాద్ ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, మందమర్రి ఏరియా ఇంజనీర్ ఇ ఎం వెంకటరమణ పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్,సి ఎం ఓ ఏ ఐ అధ్యక్షులు రమేష్,సీనియర్ పి.ఓ శంకర్,ఆఫీస్ హెచ్ ఓ డిలు అధికారులు, ఉద్యోగులు,యోగ మాస్టర్ ముల్కల శంకర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి ఎప్పటికైనా పదవులు దక్కుతాయి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కాయితి విజయ్ కుమార్ రెడ్డి కి దక్కేనా



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండల పరిధి లోని తాండ్ర గ్రామానికి చెందిన కాయితి విజయ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి కొన్ని దశాబ్దాల పాటు నిబద్ధతతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ ఏ పరిస్థితుల్లోనైనా విడిచిపెట్టకుండా, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ, సామాన్య కార్యకర్తగా నిరంతరం కృషి చేస్తూ.. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచాడు. దీంతో నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి బాధ్యతలు దక్కే అవకాశం దాదాపుగా ఖరారు అయ్యిందాని కష్టకాలంలోనూ పార్టీ జెండా వదలకుండా నికార్సైన కాంగ్రెస్ సైనికుడిగా కష్టపడ్డాడు. నియోజక వర్గంలో దశాబ్దలా కాలంగా కాంగ్రెస్ పార్టీ కోసం వివిధ హెూదాల్లో పనిచేస్తు, పార్టీలు మారకుండా ప్రాణం కంటే ఎక్కువగా పార్టీ ఎదుగుదలకు చెమటోడుస్తూ వస్తున్నాడు, అందుకే జిల్లా అధ్యక్షుడి పదవి కాయితీ విజయ్ కుమార్ రెడ్డికి దక్కుతుందని వారు నాయకులు చర్చించుకుంటున్నారు.

# సింగరేణి పాఠశాల స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి




**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూన్ 21** కళ్యాణిఖని సింగరేణి ఉన్నత పాఠశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని సింగరేణి యాజమాన్యం నిర్వహించబోయే స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియా సింగరేణి ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయ ఉపాధ్యాయ బృందం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, సింగరేణి సంస్థ ఆవిర్భవించి దేశానికి వెలుగులు పంచుతూ ఉద్యోగుల కుటుంబాలు ఉన్నత శిఖరాగ్రానికి చేరడానికి విద్యా అవసరమని భావించిన అప్పటి సీఎండి బి.ఎన్.రామన్ ఆలోచనల నుండి మొట్టమొదటిగా ప్రారంభించుకున్న మందమర్రి కళ్యాణిఖని ఏరియాలోని సింగరేణి ఉన్నత (ఎయిడెడ్) పాఠశాల 50 సంవత్సరాల స్వర్ణోత్సవ ఉత్సవాలకు సిద్ధమవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని అందరూ కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బిఎన్ రామన్ ఆలోచనలతో పుట్టుకొచ్చిన విద్యా బోధన విధానం మధ్యలో తగ్గినప్పటికీ ప్రస్తుత చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ నేతృత్వంలో కార్పోరేట్ విద్యాసంస్థలు అందించలేని అడ్వాన్స్‌డ్ కోర్సులను అందిస్తూ ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రాముఖ్యతనిస్తూ వారు ఆర్థికంగా,వ్యాపార రంగంలో, విద్యారంగంలో పట్టు సాధించే విధంగా వివిధ కోర్సులను ప్రవేశపెడుతున్నారన్నారు. రియల్ ఉమెన్ ఎంపవర్మెంట్ నినాదంతో విద్యారంగంలో మహిళలను చైతన్య పరుస్తున్నారని చెప్పారు.మారుమూల ప్రాంత ప్రజలకు కూడా నామ మాత్రపు ఖర్చులతో విలువైన విద్యను అందించాలని సింగరేణి సంకల్పిస్తుందని ప్రస్తావించారు. సీబీఎస్సీ విద్యను సింగరేణి పాఠశాలలో లాంచనంగా ప్రారంభించి అన్ని పాఠశాలలకు విస్తరించే యోచనలో యాజమాన్యం ముందుకు సాగుతుందన్నారు. ప్రపంచాన్ని శాసించే దిశగా ఏఐ టెక్నాలజీ వృద్ధి చెందుతున్న సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి పాఠశాలల్లో తీసుకువచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఉద్ఘాటించారు. మందమర్రి సింగరేణి ఉన్నత పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిన బోధనలు అందిస్తున్న ఉపాధ్యాయుల అసౌకర్యాలను గుర్తించి వారికి తగు న్యాయం జరిగే విధంగా సీఎండీ దృష్టికి తీసుకువెళ్లినట్టు వెల్లడించారు.వారికి సింగరేణి సంస్థ అందిస్తున్న సౌకర్యాలను కల్పించే విధంగా కృషి చేస్తానన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో.. నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఇంటర్ డిగ్రీ పీజీ మహిళా కళాశాలలోని విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారని కొనియాడారు. పట్టభద్రులు అర్హులైన అభ్యర్థులను ఉపాధ్యాయులుగా ఎంచుకొని బోధనలు సాగిస్తున్న సింగరేణి పాఠశాలల్లో కంప్యూటర్ సైన్స్ డిజిటల్ ల్యాబ్ లతో పాటు స్వచ్ఛమైన మినరల్ వాటర్ ప్లాంట్ సౌకర్యం,ఉచిత భోజనం,ఉచిత యూనిఫాం,ఉచిత పుస్తకాలు అందిస్తూ పచ్చని చెట్లు, వెలుతురు ప్రసరించే తరగతి గదులు విశాలమైన పది ఎకరాల స్థలంలో ప్రకృతి ఒడిలో విద్య బోధన అందించే పాఠశాలలు కేవలం సింగరేణికి మాత్రమే సొంతమని గర్వంగా చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పురుషోత్తం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంతో మరో వినూత్న పవర్ ప్లాంట్ నిర్మాణానికి సింగరేణి శ్రీకారం

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూన్ 21** 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి తొలి అడుగు.. డి పి ఆర్ తయారీకి వ్యాప్కోస్ కి పని అప్పగింత సింగరేణి సీ.ఎం.డీ, ఎన్ బలరామ్ వెల్లడి రామగుండం-1 ఏరియాలోని మూత బడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని నీటి సంపు ఆధారంగా ప్లాంట్ నిర్మాణం రాష్ట్రంలో ఇదే తొలి పీఎస్పీ ప్లాంట్ సింగరేణి భవన్,జూన్ 21,2025 వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా ఇప్పటికే థర్మల్ విద్యుత్,సోలార్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పిన సింగరేణి సంస్థ మరో వినూత్న విద్యుత్ ఉత్పాదన ప్లాంట్ ఏర్పాటుకు రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశం మేరకు రామగుండం-1 ఏరియాలో మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వాటర్ సంపు ఆధారంగా పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రాథమిక అధ్యయనాలు పూర్తిచేసిన కంపెనీ సంపూర్ణ ప్రాజెక్టు రిపోర్ట్ రూపొందించడానికి వ్యాప్కోస్ లిమిటెడ్ అనే ప్రభుత్వ రంగ సంస్థకు బాధ్యతలను అప్పగిస్తూ. లెటర్ ఆఫ్ అవార్డును అందజేసినట్లు సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ తెలియజేశారు. ఈ తరహా ప్రాజెక్టు ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎవరూ చేపట్టలేదని సింగరేణి సంస్థ దీనిని ప్రయోగాత్మకంగా చేపట్టడమే కాక విజయవంతంగా నిర్వహిస్తుందన్న నమ్మకం తమకుందన్నారు. ప్లాంటును ఏర్పాటు చేయనున్న మేడిపల్లి ఓపెన్ కాస్ట్ సంపు ను, నిర్మాణ ప్రాంతాన్ని ఇప్పటికే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధనశాఖా మంత్రి భట్టి విక్రమార్క స్వయంగా సందర్శించారని,ఈ వినూత్న ప్రాజెక్టును చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ప్రాజెక్టు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. సింగరేణి సంస్థ అప్పగించిన బాధ్యతల ప్రకారం వ్యాప్ కోస్ లిమిటెడ్ సంస్థ మేడిపల్లి ఓపెన్ కాస్ట్ సంపు ఆధారంగా 500 మెగావాట్ల పంపుడు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మించ డానికి సంబంధించిన పూర్తి అధ్యయనం జరుపు తుంది. జియోలాజికల్, జియోటెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాల తో పాటు సివిల్ డిజైన్లు,ఉత్పత్తి సామర్థ్య అంశాలు మెకానికల్, ఎలక్ట్రికల్ డిజైన్లు,పర్యావరణ సంబంధ అంశాలు, రక్షణ చర్యలు వంటి విషయాలపై సమగ్ర అధ్యయనాన్ని జరిపి డిపిఆర్ ను రూపొందించాల్సి ఉంటుంది. ప్లాంట్ నిర్మాణానికి పట్టే సమయం,నిర్మాణపు ఖర్చు, ప్లాంట్ పూర్తయిన తర్వాత ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తు అమ్మకాలకు గల అవకాశాలు తదితర అనేక విషయాలను డి. పి.ఆర్ లో పొందు పరచనున్నారు. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ప్రత్యేకతలు ఈ పంపుడు స్టోరేజ్ ప్లాంట్ ఒక రకంగా చెప్పాలంటే జల విద్యుత్తు ప్రాజెక్టు తరహాలో పనిచేస్తుంది. జల విద్యుత్తు కేంద్రాలలో నీటి ప్రవాహ ఉధృతికి టర్బైన్లు తిరగటం వల్ల, విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. అయితే అక్కడ సహజ సిద్ధమైన జలపాతాల నీటిని ఇందుకోసం వినియోగిస్తారు.కాగా పంపుడు స్టోరేజీ ప్లాంట్లు ఎత్తయిన ప్రదేశానికి తోడిన నీటిని కిందికి వదలడం ద్వారా టర్బైన్లను తిప్పి విద్యుత్ ఉత్పత్తి చేయడం జరుగుతుంది.ప్రస్తుతం మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో సుమారు..157 మీటర్ల లోతున భారీ నీటి సంపు ఏర్పడి ఏడాది పొడుగునా భారీ పరిమాణంలో నీరు నిలవ ఉంటుంది.ఈ నీటిని ఉపరితలంపై నిర్మించనున్న దాదాపు ఇదే పరిమాణం గల మరో భారీ నీటి రిజర్వాయర్ లోనికి పగటిపూట సోలార్ విద్యుత్ ద్వారా.. పంపింగ్ జరుపుతారు. ఈ విధంగా పగటిపూట నింపిన నీటిని భారీ పైపుల గుండా రాత్రివేళ కిందికి పంపిస్తూ..ఆ జల శక్తితో,మధ్యలో ఏర్పాటు చేసిన టర్బైన్లను తిప్పడం వలన విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది.కింద ఉన్న నీటిని పైకి పంపిణీ చేసి,అలా అక్కడ నిలువ చేసిన నీటిని కిందికి పంపి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు కనుక దీనినీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు అని పిలుస్తున్నారు మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని లో గల భారీ నీటి సంపు, ఉపరితలంలో రిజర్వాయర్ నిర్మించడానికి ఖాళీ ప్రదేశ లభ్యతలు ఇక్కడ ఉండటం వల్ల సింగరేణి మొత్తంలో ఈ ప్రాజెక్టును ఇక్కడే ఏర్పాటు చేయాలని ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఉపరితలంపై నీటి నిల్వ కోసం సుమారు 2,350 మీటర్ల పొడవు తో 23 మీటర్ల లోతు గల రిజర్వాయర్ డ్యాము ను నిర్మించనున్నారు. ఈ రిజర్వాయర్ లో 9.64 మిలియన్ క్యూబిక్ మీటర్ల పరిమాణం గల నీటిని నిలువ చేసి దీనిలో నుండి పంపింగ్ కోసం 8 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని వినియోగిస్తారు. ప్రాజెక్టు వ్యయం సుమారు 3000 కోట్ల రూపాయల వరకు ఉండొచ్చని అంచనా. అయినప్పటికీ 40 ఏళ్ల పాటు 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ పంప్డ్ స్టోరేజీ ప్లాంటు సింగరేణికి గట్టి ఆర్థిక పరిపుష్టిని కలిగిస్తుంది. వ్యాప్కోస్ లిమిటెడ్ సంస్థ డిపిఆర్ సిద్ధం చేయగానే నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలిచే అవకాశం ఉంది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ మరియు ఎం.డీఎన్. బలరామ్ తో పాటు డైరెక్టర్ ఈ అండ్ ఎం డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్ వి. సూర్య నారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కే. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్డిఎం సుభాని, జనరల్ మేనేజర్ సిపిపి ఏ.మనోహర్,జనరల్ మేనేజర్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఎం.సుబ్బారావు, ఇంకా వివిధ విభాగాల కార్పొరేట్ జనరల్ మేనేజర్లు మరియు ఏరియా సంబంధిత జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు .

## సంపూర్ణ అక్షరాస్యత సామాజిక బాధ్యత



అగ్నిధారన్యూస్, పెద్దపల్లి, జూన్ -21 పెద్దపల్లి జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడం మనందరి సామాజిక బాధ్యతని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు డిఆర్డిఓ రవీందర్ తెలిపారు. శనివారం అదనపు డిఆర్డిఓ రవీందర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సెర్ఫ్ లోని డిపిఎం లు, ఏపిఎం లు సిసి లు మెప్మా సిబ్బందికి ఏర్పాటు చేసిన ఉల్లాస్ యాప్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు డిఆర్డిఓ రవీందర్ మాట్లాడుతూ, దేశంలో మహిళల అక్షరాస్యతలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్ర భాగాన సెర్ఫ్, వయోజన విద్యా, తెలంగాణ ఓపెన్ స్కూల్, 2 సమగ్ర శిక్ష కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో 100 శాతం సాధించాలని కోరారు. జిల్లాలోని స్వశక్తి సంఘ మహిళలను కేంద్రంగా ముందుగా ఆక్షరాస్యులని చేయటం కొరకు ఇప్పటికే 90 శాతం సర్వే పూర్తి చేయటం జరిగిందని మరో రెండు మూడు రోజుల్లో ఈ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేసి "ఉల్లాస్" యాప్ లో ఎంట్రీ చేయాలని ఆయన కోరారు. సర్వే పూర్తి చేసాక ప్రతి 10 మంది నిరక్షరాస్యులకు ఒక చదువుకున్న మహిళ వాలంటీర్ గా ముందుకు వచ్చి నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. అదే విధంగా చదవటం, రాయటం వచ్చిన మహిళల్ని, ఓపెన్ స్కూల్ విధానంలో 10వ తరగతి , ఇంటర్ పరీక్షలు రాయటం కొరకు అడ్మిషన్లు చేయించాలని ఆయన కోరారు. మహిళల కుటుంబాలలో ఉన్న 18 సం కంటే తక్కువ ఉన్న దివ్యాంగుల పిల్లల వివరాల్ని కూడా ఈ సర్వేలో సేకరించి మండల కేంద్రాల్లోని "భవిత" కేంద్రాలకు అనుసంధానం చేసి వారికి ఫిజియోథెరపి, స్పీచ్ థెరఫి లాంటి సేవల్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమాల్ని విజయవంతం చేయటం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. హైదరాబాద్లో శిక్షణ పొందిన అడల్ట్ ఎడ్యుకేషన్ కు సంబంధించిన సిఆర్పి లు సెర్ఫ్, మెప్మా సిబ్బంది అందరికి "ఉల్లాస్" లో ఎంట్రీ కొరకు అవగాహన కల్పించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ ఏపిఓ శ్రీనివాస్, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డ్ కార్యదర్శి హన్మంత్, జిసిడిఓ కవిత, సెర్ఫ్ డిపిఎం కె.రవి లుఏపిఎం లు సిసి లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ దిక్సూచి ప్రొఫెసర్ జయశంకర్

### కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా జయశంకర్ వర్ధంతి వేడుకలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తెలంగాణ మార్గదర్శకుడు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జయశంకర్ గారి వర్ధంతిని కడ్తాల్ మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి ఆధ్వర్యంలో, ఏర్పాటుచేసిన వర్ధంతి కార్యక్రమానికి పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్,మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక నేతలతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలిలు సమర్పించి నివాళులర్పించారు. జయశంకర్ ఆశయాలను తెలంగాణ సాధనకు వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.యాచక దశ నుంచి శాసించే దశకు తెలంగాణ రావాలె! అనేసంకల్పంతో జయశంకర్ గారి ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు. మా తెలంగాణ మాగ్గావాలె, అంటూ తెలంగాణే ధ్యాస, శ్వాసగా తన జీవితాన్ని తెలంగాణ ఉద్యమానికే అంకితం చేశారని వారి సేవలను కొనియాడారు అనంతరం వృద్ధులకు పాలు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ,మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, మాజీ రైతు కోఆర్డినేటర్ మంగల్పల్లి నరసింహ మాజీ వార్డు సభ్యులు కేశని మహేష్, గురిగళ్ళ రామచంద్రయ్య,మూడ అశోక్, పాండు నాయక్, క్యామ వెంకటేష్, సిద్దిగారి వెంకటేష్,మూడ రవి అమృతం పాండు సిద్దిగారి దాసు మొగిళ్ళ చెన్నయ్య, అంజి శ్రీను సురేష్ శ్రీకాంత్, కృష్ణ, రమేష్ కుమార్, కరుణాకర్, రాఘవ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు చెస్ బోర్డులు



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు మేరెడ్డి రవిప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలకు జులై నుంచి చెస్ బోర్డులు పంపిణీ చేయడంతో పాటు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఫోరం కో-ఆర్డినేటర్ మల్లెల మాధవరెడ్డి తెలిపారు. శనివారం కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ కలిసి విన్నవించారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ మండలాల వారీగా పాఠశాలల వివరాలు, విద్యార్థుల సంఖ్యను ఫోరం సభ్యులకు అందించాలని ఏఎంఓ మహానందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. చెస్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని చెస్ బోర్డుల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సీసీ కిరణ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ కి నివాళులు అర్పించిన మాజీ మంత్రి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా శనివారంజిల్లా కేంద్రంలోని జయశంకర్ సార్ విగ్రహానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఒకనాటి విద్యార్థిగా ముల్కీ ఉద్యమములో 1969 ఉద్యమములోఉద్యమపంతులుగా అనంతరం తెలంగాణ ఉద్యమ నిప్పురవ్వని ఆరిపోకుండా మూడు దశాబ్దాలపాటు రాష్ట అభిలాషను సజీవంగా ఉంచిన తెలంగాణ కర్మయోగి, నిస్వార్థ, నిడంబర,విశ్వమానవ తేజోమూర్తి, కె.సి.ఆర్ ప్రారంభించిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి దశాబ్దంపైగా సైదాంతిక ఊపిరులూదిన తెలంగాణ జ్ఞాన శిఖరం ఆచార్య జయశంకర్ అని నిరంజన్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్,జిల్లా మీడియా కన్వీనర్నందిమల్ల.అశోక్,ప్రధాన కార్యదర్శిగంధం. పరంజ్యోతి మాజీ కౌన్సిలర్స్ నాగన్న యాదవ్,ఉంగ్లం. తిరుమల్, స్టార్.రహీమ్, సూర్యవంశం. గిరి.చిట్యాల రాము,మండల పార్టీ అధ్యక్షులు బాలరాజు మాజీ జడ్పిటిసి భీమన్న,మాజీ ఎం.పి.పిలు,సంధ్య తిరుపతయ్య,సేనాపతి,శివరాం రెడ్డి మతీన్,శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాతిపిత ఆచార్య జయశంకర్ చిత్ర పటానికి ఘన నివాళులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణంలోని వై ఆర్ ఎం డిగ్రీ కళాశాలలో తెలంగాణ జాతిపిత, తెలంగాణ మార్గదర్శకుడు ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సదానందం గౌడు మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త , మూడు తరాల తెలంగాణ ఉద్యమానికి మూల విరాట్ , తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన తెలంగాణ జాతి గర్వించే గొప్ప వ్యక్తి జయశంకర్ సార్ అని పేర్కొన్నారు.1952 ముల్కీ ఉద్యమంలో ,1969 తెలంగాణ విద్యార్థి ఉద్యమంలో ,2009 మలిదశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ యొక్క పాత్ర ,దిశ నిర్దేశం తెలంగాణ సమాజం మర్చిపోలేనిదన్నారు. భారతదేశంలో 37 రాజకీయ పార్టీలను తెలంగాణ రాష్ట్రం కోసము ఏకం చేసిన మహనీయుడు జయశంకర్ అని సదానంద గౌడ్ వివరించారు . ఈ కార్యక్రమంలో, కళాశాల అధ్యాపకులు యాదయ్య, బాల్ రాజ్, రామకృష్ణ , శ్రీనివాస్, ఇదమయ్య, వెంకటయ్య, శరత్, అమీర్ మొదలగు అధ్యాపకులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థి చదువుకి ఉప్పల వెంకటేష్ సహకారం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** అమనగల్ పట్టణానికి చెందిన పేదింటి ఆడబిడ్డ శిరీష పై చదువులు చదివించలేని స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారు.ఈ విషయాన్ని స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ని సంప్రదించగా వెంటనే స్పందించి శిరీష పై చదువుకు తాను సహకరిస్తానని శిరీష చదువుకు అండగా నిలుస్తానని ఉప్పల వెంకటేష్ శిరీష ని ఓ ప్రైవేట్ పాఠశాలలో తన సొంత డబ్బులతో చేర్పించడం జరిగింది.ఈ సందర్భంగా తన కూతురు చదువుకు సహకరించిన ఉప్పల వెంకటేష్ కి రుణపడి ఉంటామని శిరీష కుటుంబ సభ్యులు తెలియచేశారు.

బిజినెస్

## ఇక అన్ని ద్విచక్ర వాహనాలకు ఎబిఎస్ సిస్టమ్



ఎబిఎస్ అమర్చడం వల్ల ద్విచక్ర వాహనాల ధర పెరుగుతుంది. చిన్న బైక్‌లు, స్కూటర్ల ధర రూ. 2,500 నుండి రూ. 5,000 వరకు పెరగవచ్చు. గత సంవత్సరం (2024-25), 92.6 లక్షల మోటార్‌సైకిళ్లు, 68.5 లక్షల స్కూటర్లు అమ్ముడయ్యాయి. భారత ప్రభుత్వం వచ్చే ఏడాది నుండి అన్ని ద్విచక్ర వాహనాలలో (మోటార్ సైకిళ్ళు, స్కూటర్లు) యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్ ఏర్పాటును తప్పనిసరి చేయబోతోంది. ప్రభుత్వం త్వరలో ఈ విషయంలో నోటిఫికేషన్ జారీ చేయవచ్చు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి, తద్వారా ద్విచక్ర వాహన డ్రైవర్ల భద్రతను పెంచడానికి ఈ నిబంధనను రూపొందిస్తున్నారు. ఇటి నివేదిక ప్రకారం.. ప్రస్తుతం ఈ నియమం 150సిసి కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బైక్‌లపై మాత్రమే వర్తిస్తుంది. ఇప్పుడు ఇది అన్ని ద్విచక్ర వాహనాలకు, ముఖ్యంగా చిన్న, చౌక మోడళ్లకు కూడా వర్తిస్తుంది. భారతదేశంలో విక్రయించే దాదాపు 75% ద్విచక్ర వాహనాలు చిన్న ఇంజిన్‌లను కలిగి ఉంటాయి (75సిసి నుండి 125సిసి). ఎబిఎస్ అనేది ఆకస్మిక బ్రేకింగ్ వేసినప్పుడు చక్రాలు లాక్ అవ్వకుండా నిరోధించే సాంకేతికత. ఇది వాహనం జారిపోకుండా నిరోధిస్తుంది. అలాగే డ్రైవర్ వాహనాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. వాహనం స్కిడ్ కాకుండా నివారిస్తుంది. ఇది ప్రమాదాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. 2022 సంవత్సరంలో భారతదేశంలో జరిగిన 1,51,997 రోడ్డు ప్రమాదాలలో దాదాపు 20% ద్విచక్ర వాహనాలకు సంబంధించినవి.

## ఇక ఇలా చేయకుంటే సిమ్‌కార్డు పొందలేరు!



భారత ప్రభుత్వం ఇటీవల ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. మొబైల్ నంబర్లు, వ్యాపార కాల్‌లకు కెవైసి ని తప్పనిసరి చేసింది. టెలికాం రంగంలో పారదర్శకత, భద్రత, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం ప్రకారం, ఇప్పుడు ప్రీపెయిడ్ లేదా పోస్ట్‌పెయిడ్ అయినా అన్ని మొబైల్ నంబర్‌లకు కెవైసి ప్రక్రియ తప్పనిసరి అవుతుంది. గతంలో ప్రీపెయిడ్ వినియోగదారులకు కేవైసీ సౌలభ్యం ఉండేది. ఇక్కడ వారు పూర్తి కేవైసీ లేకుండా కూడా సిమ్ కార్డులను పొందవచ్చు. కానీ ఇప్పుడు అలా కుదరదు. కొత్త మార్గదర్శకాల ప్రకారం, వినియోగదారులు వారి గుర్తింపు, చిరునామా రుజువుతో కేవైసీని పూర్తి చేయాలి. ఈ ప్రక్రియను ఆఫ్‌లైన్‌లో (టెలికాం స్టోర్లలో) లేదా ఆన్‌లైన్‌లో (టెలికాం కంపెనీల వెబ్‌సైట్‌లు లేదా యాప్‌ల ద్వారా) పూర్తి చేయవచ్చు. భద్రత, పారదర్శకతను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేవైసీ లేకుంటే ఉగ్రవాద నిధులు, మనీ లాండరింగ్, మోసం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అణిచివేస్తుంది. దీనితో పాటు, అన్ని మొబైల్ నంబర్లు నమోదిత వినియోగదారులకు అనుసంధానించబడి ఉన్నాయని నిర్ధారిస్తుంది. దీనివల్ల అత్యవసర సేవలు, ప్రభుత్వ పథకాలను సులభంగా యాక్సెస్ చేయవచ్చు. కొత్త విధానం వల్ల అతిపెద్ద ప్రభావం ప్రీపెయిడ్ వినియోగదారులపై ఉంటుంది. వారు ఇకపై కేవైసీ లేకుండా సిమ్ కార్డులను పొందలేరు. ఈ ప్రక్రియ కొంచెం తక్కువ సౌకర్యవంతంగా ఉంటుంది. కానీ దీర్ఘకాలంలో ఇది భద్రత, నమ్మకాన్ని పెంచుతుంది. ఇప్పటికే కెవైసి పూర్తి చేసిన పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు ఇబ్బంది ఉండదు. అయితే, వారు ఎప్పటికప్పుడు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. కెవైసి ఎలా చేయాలి? కేవైసీని పూర్తి చేయడానికి సిమ్ కార్డు దారులు గుర్తింపు రుజువు (ఆధార్

# ఎయిర్ ఇండియాను వెంటాడుతున్న ప్రమాదాలు



గత కొన్ని రోజులుగా ఎయిర్ ఇండియా విమానాలు వరుస ప్రమాదాలను చవి చూస్తున్నాయి. తాజాగా ఎయిర్ ఇండియా విమానం ా× 2470 ఒక పక్షితో ఢీకొట్టింది. దీంతో విమానాన్ని పూణేలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఆ తర్వాత ఈ విషయం బయటపడింది. ఇందుకు సంబంధించి, జూన్ 20న పూణే నుండి ఢిల్లీకి ఎగురుతున్న ఎఐ 2470 విమానం పక్షి ఢీకొనడం వల్ల రద్దు చేయడం జరిగిందని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఇన్‌కమింగ్ విమానం పూణేలో సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత ఇది బయటపడింది. దర్యాప్తు కోసం విమానాన్ని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణీకులను ఢిల్లీకి తీసుకెళ్లడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మరోవైపు తనిఖీల నేపథ్యంలో ఎయిర్ ఇండియా జూన్ 21 మరియు జూలై 15 మధ్య 16 అంతర్జాతీయ విమాన మార్గాల్లో విమానాలను తగ్గిస్తున్నట్లు తెలిపింది. ఈ సమయంలో, 3 విదేశీ మార్గాల్లో విమానాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం తర్వాత, ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్ ఇండియా పేర్కొంది. ఈ లక్ష్యం ప్రోగ్రామ్ స్థిరత్వాన్ని పునరుద్ధరించడమేనని ఎయిర్‌లైన్ తెలిపింది. అలాగే, ప్రయాణీకులకు కలిగే అసౌకర్యాన్ని తగ్గించాలని నిర్ణయించింది. శుక్రవారం నాడు ఎయిర్ ఇండియా 8 విమానాలను రద్దు చేసింది. వీటిలో 4 అంతర్జాతీయ, 4 దేశీయ విమానాలు ఉన్నాయి. నిర్వహణ, కార్యాచరణ కారణాల వల్ల విమానాలను రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్ పేర్కొంది. ఈ విషయంలో అధికారిక ప్రకటనలో ప్రయాణీకులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని పేర్కొంది. వీలైనంత త్వరగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రయాణీకులకు రద్దు, పూర్తి వాపసు లేదా రీషెడ్యూల్ సౌకర్యం కల్పించారు. గతంలో, వైడ్-బాడీ విమానాలతో నడిచే విమానాలను తాత్కాలికంగా 15 శాతం తగ్గిస్తున్నట్లు ఎయిర్‌లైన్ తెలిపింది. ఈ తగ్గింపు జూలై 21 నుండి 15 వరకు కొనసాగుతుంది. ఢిల్లీ-నైరోబి, అమృత్‌సర్-లండన్ (గాట్విక్), గోవా (మోపా)-లండన్ (గాట్విక్) సర్వీసులు జూలై 15 వరకు నిలిపివేయడం జరిగింది. ఉత్తర అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, తూర్పు ప్రాంతాల నగరాలను అనుసంధానించే 16 అంతర్జాతీయ మార్గాల్లో విమానాలు తగ్గించింది.

# అబ్బురపరిచేలా ఎన్ఐఎటి శిక్షణ పొందిన విద్యార్థుల ప్రతిభ



ఇండస్ట్రీ రెడీ శిక్షణ పొందుతున్న ఎన్ఐఎటి ఫస్ట్ ఇయర్ విద్యార్థుల బృందం, జాతీయ స్థాయిలో జరిగిన 'ది మ్యాట్రిక్స్ ప్రోటోకాల్' ఎఐ హ్యాకథాన్ ఫైనల్ రౌండ్ కి ఎంపికైన టాప్-10 టీమ్స్ లో ఒకటిగా నిలిచింది. ఈ 48 గంటల ఫిన్టెక్ ఇన్నోవేషన్ స్ప్రింట్ ను భారతదేశంలోనే అగ్రస్థానంలో ఉన్న పియర్-టు-పియర్ లెండింగ్ ప్లాట్ఫారమ్ లెన్డెన్ఓ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో జూన్ 13. నుంచి 15 వరకు ముంబయిలో నిర్వహించారు. ఈ పోటీలో భాగంగా పాల్గొన్నవారు, నిత్య ఆదాయం లేని వ్యక్తులకోసం ఏఐ ఆధారిత క్రెడిట్ స్కోరింగ్ మోడల్స్ రూపొందించాల్సిన ఛాలెంజ్ ఎదురుకున్నారు. ఇది ప్రస్తుత ఫిన్టెక్ రంగంలో ఒక పెద్ద సమస్యగా పరిగణించబడుతోంది. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్కు భారతదేశం నలుమూలల నుంచే కాదు, ఆస్ట్రేలియా, బ్రెజిల్, జర్మనీ, నేపాల్, పెరూ, సౌదీ అరేబియా లాంటి దేశాల నుంచి కలిపి మొత్తం 1,800 మందికి పైగా పాల్గొన్నారు. ఆన్లైన్ రౌండ్ చాలా కఠినంగా ఉండటంతో, చివరికి టాప్ 150 సమస్య పరిష్కర్తలకు ముంబయిలో జరిగే ఆఫ్లైన్ ఫైనల్స్కు ఎంపిక చేశారు. వీరిలో ఐఐటీలు, ఎన్ ఐటీ లు, ఐఐఎంలు, ఐఎస్ ఐ లాంటి అగ్ర విద్యాసంస్థల విద్యార్థులతో పాటు, కాగ్నిజెంట్, మోర్గాన్ స్టాన్లీ. మహీంద్రా, ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, ఈఎక్సెల్, వొడాఫోన్ ఐడియా, ఒరాకిల్, జేపీ మోర్గాన్ చేస్, ఎంఎల్ ఎక్స్పర్ట్స్ ఏఐ, లాంటి దిగ్గజ సంస్థల టెక్నాలజీ నిపుణులు కూడా ఉన్నారు. ఇండస్ట్రీ రెడీ శిక్షణ పొందుతున్న ఎన్ఐఎటి విద్యార్థులు జాతీయ ఫిన్టెక్ హ్యాకథాన్లో తొలిసారిగా పాల్గొన్నారు. కానీ ఆ మొదటిప్రయత్నమే గొప్ప విజయాన్ని అందించింది. అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్, ఫ్రీలాన్సర్లు వలపర్లు, స్టార్టప్ ఫౌండర్ల తో పోటీపడి టాప్-10లో చోటు దక్కించుకున్నారు. ఎన్ఐఎటి ఫ్యాకల్టీ, ఆలుమ్నీ మెంటర్ల మార్గదర్శకత్వంలో విద్యార్థులు స్థిరమైన ఆదాయం లేని వ్యక్తుల కోసం వారి ఆదాయాన్ని అంచనా వేసే ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మోడల్ తయారు చేశారు. ఇది వారికి రీపేమెంట్ క్రెడిట్ స్కోర్ను జెనరేట్ చేస్తుంది. ఈ సిస్టమ్ ఆధారంగా బ్యాంకులు, సంస్థలు త్వరగా నిర్ణయాలు తీసుకోగలుగుతాయి. "జాతీయ హ్యాకథాన్లో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లకు అసలు అవకాశం ఉంటుందా? అనేదే మాకు మొదట్లో సందేహంగా అనిపించింది. కానీ ఫైనల్ డెమో జరిగే సమయానికి ఇండస్ట్రీ మెంటర్లు మా కోడ్ అడగడం మాకు చాలా చూడాలని కాన్ఫిడెన్స్ ఇచ్చింది," అంటున్నారు ఫస్ట్ ఇయర్ విద్యార్థి వేగా దర్శి.

# భారీ స్కోర్ దిశగా భారత్.. రెండోరోజు లంచ్ సమయానికి స్కోర్ 454/7

ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా భారీ స్కోర్ దిశగా సాగుతున్నది. రెండోరోజు తొలి సెషన్‌లో నాలుగు వికెట్లు నష్టపోయింది. లంచ్ బ్రేక్ సమయానికి భారత్ ఏడు వికెట్ల నష్టానికి 454 పరుగులు చేసింది. ప్రస్తుతం రవీంద్ర జడేజా రెండు పరుగులతో క్రీజులో ఉన్నాడు. తొలి రోజు మూడు వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసిన విషయం తెలిసిందే. రెండోరోజు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ బ్యాటింగ్ కొనసాగించారు. తొలిరోజు హాఫ్ సెంచరీ చేసిన పంత్.. రెండోరోజు తన కెరియర్‌లో ఏడో సెంచరీ చేశాడు. ఆ తర్వాత షోయబ్ బషీర్ బౌలింగ్‌లో కెప్టెన్ గిల్ అవుటయ్యాడు. దాంతో వీరిద్దరి భాగస్వామ్యానికి తెరపడింది. గిల్ అవుట్ అయ్యాక కరుణ్ నాయర్ సైతం ఎక్కువసేపు క్రీజులో నిలువ లేకపోయాడు. చాలా రోజుల తర్వాత మళ్లీ టీమిండియాలోకి వచ్చిన నాయర్.. ఖాతా తెరువకుండానే పెవిలియన్‌కు చేరుకున్నాడు. ఆ తర్వాత పంత్ కూడా టంగ్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. ఆ తర్వాత స్టోక్స్ శార్దుల్ ఠాకూర్‌ను అవుట్ చేశాడు. శర్దూల్ అవుట్ తర్వాత అంపైర్లు లంచ్ బ్రేక్ ప్రకటించారు. ఇప్పటి వరకు భారత బ్యాట్స్‌మన్‌లలో జైస్వాల్ (101), కేఎల్ రాహుల్ (42), శుభ్‌మన్ గిల్ (147), రిషబ్ పంత్ (134) పరుగులు చేయగా.. సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ ఇద్దరూ డకౌట్ అయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్‌కు నాలుగు వికెట్లు దక్కగా.. బ్రైడన్ కార్సే, జోష్ టంగ్, షోయబ్ బషీర్‌కు తలో వికెట్ దక్కింది.



## ఎనిమిదేళ్ల తర్వాత ఛాన్స్.. కట్ చేస్తే!

# రీఎంట్రీ మ్యాచ్‌లో డకౌట్



టీమిండియా వెటరన్ ఆటగాడు కరుణ్ నాయర్ తన రీ ఎంట్రీలో తీవ్రనిరాశపరిచాడు. ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత భారత జట్టులోకి తిరిగొచ్చిన.. కరుణ్ నాయర్‌కు తన లభించిన అవకాశాన్నిసద్వినియోగం చేసుకోలేకపోయాడు. లీడ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో కరుణ్ డకౌటయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన నాయర్ నాలుగు బంతులు ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో ఓలీ పోప్ సంచలన క్యాచ్ అందుకోవడంతో నాయర్ డకౌట్ అవ్వాల్సి వచ్చింది. అంతకుముందు అరంగేట్ర ఆటగాడు సాయిసుదర్శన్ కూడా తన ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు.

స్పోర్ట్స్

## యశస్వీ జోరుకు బ్రాడ్‌మన్ రికార్డు బద్ధలు.. ధోనీని వెనక్కినెట్టిన పంత్..!



ఇంగ్లండ్ పర్యటనలో రెచ్చిపోయి ఆడుతున్న భారత యువ క్రికెటర్లు రికార్డులు బద్ధలు కొడుతున్నారు. హెడింగ్లే టెస్టులో శతకంతో విజృంభించిన యశస్వీ జైస్వాల్ తన బ్యాట్ పవర్ చూపిస్తూ మరోసారి ఇంగ్లండ్‌పై తన ఆధిపత్యాన్ని చెలాయించాడు. ఈ ఏడాది ఆరంభంలో ఆ జట్టుపై విశాఖ టెస్టులోడబుల్ సెంచరీ బాదిన అతడు.. ఈసారి వాళ్ల గడ్డపైనే వంద కొట్టి లెజెండ్ సర్ డాన్ బ్రాడ్‌మన్ రికార్డును బ్రేక్ చేశాడు. ఇదే మ్యాచ్‌లోఅర్ధశతకంతో చెలరేగిన వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ దిగ్గజ ఆటగాడు ఎంఎస్ ధోనీని వెనక్కి నెట్టేశాడు. తొలి రోజు నాటౌట్‌గా నిలిచిన అతడు సేనా దేశాల(దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా)పై అత్యధిక సగటుతో మహీ రికార్డు బద్దులు కొట్టాడు. సీనియర్ల వీడ్కోలుతో నవశకం మొదలైన ఇంగ్లండ్ పర్యటనలో యశస్వీ జైస్వాల్ తన ఫుట్‌వర్క్, టెక్నిక్‌తో క్రీజులో పాతుకుపోయాడు. తొలి ఇన్నింగ్స్‌ల్లో 101 రన్స్ బాదిన ఈ యంగ్‌స్టర్ స్టోక్స్ సేనపై10 ఇన్నింగ్స్‌లో 813 పరుగులు సాధించాడు. ప్రస్తుతానికి అతడి సగటు 90.33 గా ఉంది. తద్వారా అత్యధిక సగటుతో ఆసీస్ దిగ్గజాన్ని దాటేశాడు యశస్వీ. 63 ఇన్నింగ్స్‌ల్లో ఇంగ్లండ్‌పై 5,028 రన్స్ చేసిన బ్రాడ్‌మన్ సగటు 89.78 మాత్రమే. దాంతో, ఇంగ్లండ్‌పై అత్యుత్తమ సగటు కలిగిన బ్యాటర్‌గా యశస్వీ సరికొత్త రికార్డు లిఖించాడు. లంచ్ తర్వాత యశస్వీ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ తనమార్క్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(127 నాటౌట్) సెంచరీ కొట్టాక రెచ్చిపోయిన పంత్.. వోక్స్, టంగ్ ఓవర్లలో బౌండరీలతో విజృంభించాడు. ఆట ముగిసే సరికి 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన ఈ డాషింగ్ బ్యాటర్ సేనా దేశాలపై 38.80 సగటు నమోదు చేశాడు. విదేశీ పిచ్‌లపై చెలరేగిపోయే పంత్.. ఈ దేశాలపై 27 మ్యాచుల్లో నాలుగు సెంచరీలు, ఆరు అర్ధ శతకాలు సాధించాడు. హెడింగ్లేలో గిల్, యశస్వీ సెంచరీలు.. పంత్ ఫిఫ్టీతో తొలిరోజే 359 పరుగులు చేసింది టీమిండియా. ఈమైదానంలో 2002లో చివరిసారి గెలుపొందిన భారత జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది.



# ఆసక్తిరంగా "స:కుటుంబానాం" టీజర్

ఈ మధ్యకాలంలో కంటెంట్ ఉన్న సినిమాలు ఏ రేంజ్ లో ప్రేక్షకులని ఆకట్టుకుంటున్నాయో చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమా కూడా అలాంటి కోవలోకే వెళ్తుంది అని చెప్పచ్చు. ఫ్యామిలీ మ్యాన్ అనిపించుకుంటున్న కథానాయకుడు ఫ్యామిలీనీ హేట్ చేస్తూ కనిపించిన ఈ టీజర్ తో కథ తాలూకు కొత్తదనం చెప్పకనే చెప్పారు దర్శక రచయిత ఉదయ్ శర్మ. మణిశర్మ సంగీతం అందించిన ఈ సరికొత్త కుటుంబ కథా చిత్రంలో రాజేంద్రప్రసాద్, రామ్ కిరణ్, మేఘా ఆకాష్, బ్రహ్మానందం, సత్య, గిరి, భద్రం ముఖ్య తారాగణంగా.. ప్రేక్షకులని అలరించబోతున్నారు. ఈ చిత్ర టీజర్ విషయానికి వస్తే ఒక పక్క నుండి అర్జున్ రెడ్డి లాంటి వైబ్స్ కనిపిస్తూనే మరోపక్క కుటుంబ సమేతంగా చూసే చిత్రం అని అర్థమవుతుంది. టీజర్ లోని ప్రతి డైలాగ్, విజువల్ ఎంతో అద్భుతంగా ఉన్నాయి. అలాగే సత్య, బ్రహ్మానందం గారి హాస్యం చిత్రంలో బాగా పండుతుందని అనిపిస్తుంది. మేఘా ఆకాష్ మంచి క్యారెక్టర్ ప్లే చేసినట్లు అర్థమవుతుంది. రామ్ కిరణ్ ఈ చిత్రం ద్వారా ఇండస్ట్రీలో ఒక మార్క్ సృష్టిస్తారు నడిపించేలా తన ప్రెసెన్స్ %ఽ% పర్ఫార్మెన్స్ కనిపిస్తుంది. కుటుంబం విషయాలలో హీరో ఉద్దేశం అందరిలా సహజంగా ప్రేమగా కాకుండా కాస్త కొత్తగా ఉంటుందని ఈ చిత్ర టీజర్ అనిపిస్తుంది. టీజర్ లోని సంగీతం చాలా బాగుంది.



# కన్నప్పకు దారి దొరికేసింది

ఇంకో వారం రోజుల్లో విడుదల కాబోతున్న కన్నప్ప మంచు విష్ణుకి చాలా ప్రెస్టీజియస్ మూవీ. ప్రమోషన్ల పరంగా తన శక్తివంచన లేకుండా కష్టపడిన వైనం మీడియాలో కనిపిస్తోంది. దుబాయ్ కెళ్ళి మరీ ఈవెంట్ చేయడం ఎంత కమిట్ మెంట్ ఉందో తేటతెల్లం చేస్తోంది. హైదరాబాద్ లో జరగబోయే ప్రీ రిలీజ్ ఈవెంట్ తో దీన్ని పతాక స్థాయికి తీసుకెళ్లే ప్లాన్ లో ఉన్న విష్ణు దానికి ప్రభాస్ ని గెస్టుగా తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఉన్నాడు. ఎంతవరకు సఫలీకృతమవుతాడో వేడుక జరిగే రోజే తెలియనుంది. అయితే ఇప్పుడు టాపిక్ ఇది కాదు. కుబేరకొస్తున్న స్పందన కన్నప్పకు కొత్త ఉత్సహాన్ని ఇచ్చేలా ఉంది.ఎందుకంటే గత కొన్ని వారాలుగా థియేటర్ల దగ్గర వాతావరణం చూసి బయ్యర్లు, నిర్మాతలు టెన్షన్ పడ్డారు. ప్రేక్షకులు సినిమాలు చూసే మూడ్ లో లేరని, ఇప్పట్లో మార్పు వచ్చేలా లేదని ఏవేవో విశ్లేషణలు చేసుకున్నారు. కొందరు ఏకంగా రివ్యూలే దెబ్బ కొడుతున్నాయని స్టేట్ మెంట్ ఇచ్చారు. అవన్నీ తప్పని కుబేర నిరూపించింది. రెగ్యులర్ మాస్ సినిమా కాకపోయినా జనం ఆదరిస్తున్న తీరు కళ్ళముందు కనిపిస్తోంది. ఏపీలోని ప్రధాన కేంద్రాల్లో 75 రూపాయల హైక్ ఇచ్చినా హౌస్ ఫుల్స్ పడటమే దానికి నిదర్శనం. పాజిటివ్ టాక్ వస్తే చాలు జనాలు మధ్యాన్నం షోల నుంచే పెరగడం ప్రారంభమవుతుందని ప్రూవ్ చేసింది. జూన్ 27న కన్నప్పకు కావాల్సింది ఇలాంటి టాకే. ప్రభాస్ ఇమేజ్ ఓపెనింగ్స్ తీసుకొచ్చినా తర్వాత లాంగ్ రన్ లో నిలబెట్టాల్సింది మాత్రం మంచు విష్ణునే. అది తెలిసే తన వంతుగా ఆడియన్స్ లోకి ఎక్కువ తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు.

# రావిపూడి స్పీడుని పాఠంగా చదవాల్సిందే



మెగా 157ని దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న తీరు చూసి ఇండస్ట్రీ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసి మూడో దానికి రంగం సిద్ధం చేస్తున్న ఈ మెట్రో స్పీడ్ డైరెక్టర్ అనుకున్న దానికన్నా చాలా ముందుగా గుమ్మడికాయ కొట్టేలా ఉన్నాడు. ఇటీవలే చిరంజీవి, నయనతార, క్యాథరిన్ త్రెస్సా, బుల్లిరాజు తదితరుల మీద కొన్ని ముఖ్యమైన సన్నివేశాలు పూర్తి చేసిన రావిపూడి అసలైన భాగం కోసం రంగం సిద్ధం చేస్తున్నాడు. చిరు, వెంకటేష్ కాంబోలో వచ్చే సీన్లు, ఎపిసోడ్లకు వచ్చే నెల నుంచి శ్రీకారం చుట్టబోతున్నట్టు తెలిసింది. డేట్లు ఫైనలయ్యాయి కానీ బయటికి రాలేదు.అతను తీసేవి కామెడీ కమర్షియల్ ఎంటర్ టైనర్లే కావొచ్చు. కానీ క్వాలిటీ తగ్గకుండా, వేగం మిస్ కాకుండా మైంటైన్ చేస్తున్న స్థిరత్వం ఖచ్చితంగా ఒక పాఠం లాంటిది. ప్యాన్ ఇండియా ట్రాప్ లో పడి సంవత్సరాల తరబడి విలువైన కాలాన్ని వృథా చేస్తున్న కొత్త దర్శకులు తన నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. 2023లో ఒక చిన్న సినిమాతో తొంభై కోట్ల గ్రాసర్ ఖాతాలో వేసుకున్న డెబ్యూ డైరెక్టర్ ఇప్పటిదాకా ఇంకో మూవీ మొదలుపెట్టలేదు. హిందీ రీమేక్ అంటూ టైం వేస్ట్ చేసుకున్నాడు. అంతకు ముందు కరోనా టైంలో జాతీయ అవార్డు సాధించిన కల్ట్ మూవీ తీసిన ఇంకో కుర్ర దర్శకుడు పద్దెనిమిది నెలల తర్వాత మెగా ఫోన్ పట్టుకున్నాడు. ఇంత గ్యాప్ లో చాలా సినిమాల్లో నటుడిగా కనిపించాడు తప్ప డైరెక్టర్ గా ఎలాంటి దూకుడు చూపించలేదు. మొన్నటి ఏడాది ఎమోషనల్ మూవీతో సూపర్ హిట్ కొట్టిన మరో సెన్సిటివ్ దర్శకుడు వేరే టయర్ 1 స్టార్ కోసం రెండేళ్లు ఎదురు చూసి తిరిగి తన డెబ్యూ హీరో దగ్గరకే చేరుకున్నాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ లిస్టుకు అంతం ఉండదు. అందుకే అనిల్ రావిపూడి టాలీవుడ్ లీగ్ లో చాలా స్పెషల్ గా నిలుస్తున్నాడు.

# నా కూతురి జోలికి వస్తే అస్సలు ఊరుకోను..

## కారుతో తొక్కించేస్తానంటూ కాజోల్ వార్నింగ్

అలనాటి అందాల ముద్దుగుమ్మ కాజోల్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఎన్నో సినిమాలలో, కమర్షియల్ యాడ్స్ లో నటించి ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. ఈమెకు బాలీవుడ్ తో పాటు టాలీవుడ్ లో కూడా విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఈ మధ్య కాజోల్ ఎక్కువగా వార్తలలో నిలుస్తుంది. ప్రపంచంలోనే అత్యంత విస్తీర్ణం కలిగిన ఫిల్మ్ స్టూడియోగా గిన్నిస్ బుక్ అవార్డును అందుకున్న రామోజీ ఫిల్మ్ స్టూడియో లో తనకు నెగిటివ్ వైబ్స్ వచ్చాయని, అక్కడ దెయ్యాలు ఉన్నాయన్నట్లు రీసెంట్ గా చెప్పుకొచ్చింది. కొన్ని ప్రదేశాలు చాలా భయపెడతాయి, వెంటనే ఆ ప్రదేశం నుంచి బయటకు వచ్చేసి ఆ తరువాత ఎప్పుడు అక్కడకు వెళ్లాలనిపించదు. అందులో ఒకటి హైదరాబాద్ లో ఉన్న రామోజీ ఫిల్మ్ స్టూడియో అని కాజోల్ కామెంట్ చేసింది. దీనిపై నెట్టింట పలు రకాల కామెంట్స్ చేశారు. ఇక ఇదిలా ఉంటే తన కూతురిని ట్రోల్స్ చేసే వారికి తాజాగా సీరియస్ వార్నింగ్ ఇచ్చింది కాజోల్. నా కూతుర్ని విమర్శించే వాళ్ళు ఎవరూ కూడా నా కారు ముందుకు రావద్దు. ఒకవేళ వచ్చారే అనుకోండి.. నా కారుతో మిమ్మల్ని ఢీ కొట్టి మీ శరీరంపై నుండి నా కారుని పోనిస్తాను. సోషల్ మీడియాలో వెయ్యి మెసేజ్‌లు వస్తే అందులో 999 కామెంట్స్ తను అందంగా ఉంది, అమేజింగ్, ఇలాంటి కామెంట్స్ ఉంటాయి. కాని ఏదో ఒక్క కామెంట్ మాత్రం బ్యాడ్‌గా ఉంటుంది. అలా చెత్త వాగుడు వాగేవారు ఎందుకున్నారో అర్థం కాదు. అయినా నేను మంచి గురించే ఎక్కువగా పట్టించుకుంటాను.చెడుని లెక్క చేయను అని ఘాటు కామెంట్స్ చేసింది. కాగా, కాజోల్ బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ని 1999 లో పెళ్లి చేసుకున్నారు. 2003లో వీరికి కూతురు నైసా జన్మించింది. 2010లో కుమారుడు యుగ్ పుట్టాడు. ప్రస్తుతం తన ఫ్యామిలీకి సమయం కేటాయిస్తూనే అడపాదడపా సినిమాలలో నటిస్తూ అలరిస్తుంది.



Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
RNI TITLE CODE:TELTEL/2024/89359 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com